నేటి కందం- నేటికి అందం

అలవోకగ నాంధ్రమునకు
పలు శుభములు గలుగు రీతి వచ్చినదగు"గూ
గులు డైడెన్ సెంటరు"నకు
బలభిదునిగ చంద్రబాబు స్వాగతము నిడెన్ !!

(రు 84000 కోట్లతో ఆంధ్రప్రదేశ్ లో పెట్టుబడులు పెట్టడానికి వచ్చిన గూగుల్ డైడెన్ ను చంద్రబాబు స్వాగతించి ఒప్పందం చేసుకున్నారు.)



-రాధశ్రీ
సెల్:9494481210

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

మంత్రుల మధ్యలో
మసులుతున్న వైరం
అంతర్గతమైతేనేమి
అవుతున్నది స్వైరం.
పక్కవాళ్ల పనిలో వేలు
పెట్టి గెలికుడెందుకు
పరువుపోతే పార్టీ ఇంకా
పోగలదా ముందుకు

చురక



-వేల్పుల నారాయణ
9440433475

website:www.netinijam.com  ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433  E-mail:netinijam93@gmail.com

హైదరాబాద్ బుధవారం 15-10-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 Postal No.HQ/SD/258/2024-2026 Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:58 పేజీలు:6 వెల: రూ.1/-


## అనన్యని అభినందించిన ముఖ్యమంత్రి



హైదరాబాద్, అక్టోబర్ 14: నారాయణ పేట జిల్లా మక్తల్ ప్రాంతానికి చెందిన జాతీయ వాలీబాల్ ప్లేయర్ పుల్లారి అనన్య శ్రీని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందించారు. ఈ రోజు జూబ్లీహిల్స్ లో ఆయన నివాసంలో రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది.

ఈ సందర్భంగా అనన్య శ్రీ సాధించిన సీనియర్ నేషనల్ గోల్డ్ మెడల్, ఎఫ్.ఐ.ఎస్.యూ వరల్డ్ యూనివర్సిటీ మెడల్ ఇతర స్థాయిలో సాధించిన మెడల్స్ ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చూపించడం జరిగింది. ఈ సందర్భంగా అనన్యను ముఖ్యమంత్రి అభినందించి శాలువాతో ఘనంగా సన్మానించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యభువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్, పుల్లారి ఆనంద్,,వరలక్ష్మి,,ఆదిత్య ,,సౌర్య తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛందంగా లొంగిపోయిన మావోయిస్టు అగ్రనేత మల్లోజుల



గడ్చిరోలి అక్టోబర్ 14 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: ఆపరేషన్ కగార్ పేరుతో చేపట్టిన తర్వాత నుంచి మావోయిస్టుల సంఖ్య క్రమంగా తగ్గుతూ వస్తుంది. భద్రతా బలగాలు, మావోల మధ్య జరిగే ఎధురుకాల్పుల్లో కొందరు మావోలు మృతి చెందుతుంటే.. మరికొందరు స్వచ్ఛందంగా పోలీసుల ఎదుట లొంగిపోతున్నారు. తాజాగా మావోయిస్టు అగ్రనేత మల్లోజుల వేణుగోపాల్ రావు పోలీసులకు లొంగిపోయారు. 60 మందితో కలిసి మల్లోజుల గడ్చిరోలి పోలీస్‌ల ఎదుట లొంగిపోయినట్లు ఛత్తీస్గఢ్ ఉప ముఖ్యమంత్రి విజయ్ శర్మ వెల్లడించారు. ఈ సందర్భంగా విజయ్ శర్మ మాట్లాడుతూ.. "మావోయిస్టు నేతలు జనజీవన స్రవంతిలో కలవడాన్ని హర్షిస్తున్నాం. నక్సలిజం అంతం కావాలని బస్తర్ ప్రాంత ప్రజలు కోరుకుంటున్నారు" అని అన్నారు. లొంగిపోయిన మావోయిస్టులకు ఉపాధి కల్పిస్తామని విజయ్ శర్మ హామీ ఇచ్చారు. 1970లో మల్లోజుల అలియాస్ సోను అలియాస్ భూపతి మావోయిస్టు పార్టీలో చేరారు. మావోయిస్టు అగ్రనేత కోటేశ్వర రావు అలియాస్ కిషన్‌జీకి ఆయన సోదరుడు.

## ఏటా మధుకర్ ఆత్మహత్య విషాద ఘటన

### -మధుకర్ కుటుంబ సభ్యులను పరామర్శించిన బిజెపి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు



హైదరాబాద్ అక్టోబర్ 14 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );మంచిర్యాల జిల్లా వేమనపల్లి మండలం నీల్వాయి గ్రామానికి చెందిన వేమనపల్లి మండల బిజెపి అధ్యక్షుడు ఏటా మధుకర్ ఆత్మహత్యకు గురైన విషాద ఘటన పట్ల పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రాంచందర్ రావు మంగళవారం మధుకర్ కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. పార్టీ కోసం నిస్వార్థంగా పోరాడిన ధైర్యవంతుడు మధుకర్ అని, కాంగ్రెస్ ప్రభుత్వ దౌర్జన్యం, అక్రమ కేసులు, కాంగ్రెస్ నాయకుల వేధింపులు తట్టుకోలేక ప్రాణాలు కోల్పోవడం అత్యంత దురదృష్టకరమని పేర్కొన్నారు.బిజెపి కార్యకర్తలపై అణచివేత, భయపెట్టే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ఆ దౌర్జన్యాలే మధుకర్ మృతికి కారణమని ఆవేదన వ్యక్తం చేశారు. బిజెపి కార్యకర్తలందరికీ పార్టీ అండగా ఉంటుందని.. ఏ ఇబ్బంది వచ్చినా పార్టీకి తెలియజేయాలని.. ఎవరూ ఇలాంటి అఘాయిత్యానికి పాల్పడకూడదని రాంచందర్ రావు సూచించారు. మధుకర్ మృతికి బాధ్యులైన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని రామగుండం సీపీకి ఫిర్యాదు చేస్తామని తెలిపారు. నేరస్తులను ఎంతటివారైనా గుర్తించి చట్టపరంగా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రాంచందర్ రావు వెంట బిజెపి రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి సుభాష్ ,భరత్ ఉన్నారు.

## ఉపరితల ఆవర్తనం ఎఫెక్ట్.. పిడుగులతో కూడిన భారీ వర్షాలు

అమరావతి, అక్టోబర్ 14:నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పిడుగులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు తెలిపారు. కోస్తాంధ్ర, దాని పరిసర ప్రాంతాల్లో సముద్ర మట్టానికి సగటున 0.9కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉందని వెల్లడించారు. దీనితో పాటుగా నైరుతి బంగాళాఖాతం, ఆనుకుని ఉన్న దక్షిణ తమిళనాడు తీరం మీదుగా మరో ఉపరితల ఆవర్తనం కొనసాగుతుందని చెప్పుకొచ్చారు.

వీటి ప్రభావంతో మంగళవారం(14-10-2025) ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, నెల్లూరు, కర్నూలు, అనంతపురం, తిరుపతి జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వివరించారు. అల్లూరి, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నంద్యాల, శ్రీసత్యసాయి, కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు పేర్కొన్నారు.

అలాగే, బుధవారం (15-10-25) ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు తెలిపారు. పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, అనంతపురం, శ్రీసత్యసాయి, కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించారు.

## బీహార్ ఎన్నికలు.. తొలి జాబితా విడుదల చేసిన బీజేపీ

న్యూఢిల్లీ, అక్టోబర్ 14: బీహార్‌లో రాజకీయాలు వేడెక్కాయి. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడంతో పార్టీల్లో ఉత్సాహం పెరిగింది. ప్రధాన పార్టీలు వ్యూహాలకు పదును పెట్టాయి. గెలుపు గుర్రాలను ఎంపిక చేయడంలో బిజీగా మారిపోయాయి. ఈ క్రమంలో బీజేపీ సైతం గెలుపే లక్ష్యంగా ముందుకెళ్తోంది. ఇందులో భాగంగా బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయనున్న అభ్యర్థులకు సంబంధించి తొలి జాబితాను కమలం పార్టీ ఇవాళ రిలీజ్ చేసింది

71 మంది అభ్యర్థులతో కూడిన జాబితాను విడుదల చేసింది. తొలి జాబితాలో ఉప ముఖ్యమంత్రులు సామ్రాట్ చౌదరి, విజయ్ సిన్హాలు కూడా ఉన్నారు. సామ్రాట్ చౌదరి.. తారాపుర్ నుంచి, విజయ్ సిన్హా లఖిసరాయ్ నుంచి బరిలో దిగనున్నారు. వీరితోపాటూ రామ్ కృపాల్ యాదవ్, ప్రేమ్ కుమార్, మాజీ ఉప ముఖ్యమంత్రి తార్కిషోర్ ప్రసాద్, అలోక్ రంజన్ ఝా, మంగళ్ పాండే వంటి పలువురు పార్టీ ముఖ్య నేతల పేర్లు కూడా ఫస్ట్ లిస్ట్‌లో ఉన్నాయి. ఇక బీహార్ అసెంబ్లీ ఎన్నికలు రెండు దశల్లో జరగనున్నాయి. తొలి దశ నవంబర్ 6, రెండో దశ నవంబర్ 11 తేదీల్లో జరగనున్నాయి. అదేనెల 14న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు విడుదల చేయనున్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీ మొత్తం 101 స్థానాల్లో పోటీ చేయనున్న విషయం తెలిసిందే. ఈమేరకు ఎన్డీయే కూటమి పార్టీల మధ్య ఇటీవలే సీట్ల సర్దుబాటు ఖరారైంది.

## మంత్రుల మధ్య విభేదాలు.. స్పందించిన మంత్రి ఉత్తమ్

నల్గొండ, అక్టోబరు14: ఇరిగేషన్ శాఖ లో అవినీతి ఆరోపణలు అవాస్తవమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. తన శాఖ, తన జిల్లా అభివృద్ధి పనులపై తాను ఫోకస్ పెట్టానని వ్యాఖ్యానించారు. మంత్రుల మధ్య సమన్వయం ఉందని.. విబేధాలు లేవని క్లారిటీ ఇచ్చారు. ఇవాళ(మంగళవారం) ఉత్తమ్ కుమార్ రెడ్డి మీడియాతో చిట్ చాట్ చేశారు.

తన శాఖలో బదిలీలు నిబంధనల ప్రకారం జరిగాయని.... ప్రాసెస్ అంతా తానే దగ్గరుండి చూశానని చెప్పుకొచ్చారు. నీటి వాటాల్లో తెలంగాణ హక్కుల కోసం పోరాటం చేస్తూనే ఉన్నామని ఉద్ఘాటించారు. కర్ణాటకలో కాంగ్రెస్, మహారాష్ట్రాలో బీజేపీ, ఏపీలో టీడీపీ ఉన్నా తమ హక్కులను వదులుకోబోమని స్పష్టం చేశారు. బనకచర్ల, ఆల్మట్టిపై తాము నిబంధనల ప్రకారం ఫైట్ చేస్తున్నామని తెలిపారు. కృష్ణా, గోదావరిలో నీటి వాటాల కోసం తమ ప్రభుత్వం కమిట్‌మెంట్‌తో పనిచేస్తోందని పేర్కొన్నారు. త్వరలోనే తాము మహారాష్ట్ర వెళ్తున్నామని చెప్పుకొచ్చారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి.

కేసీఆర్ పదేళ్లలో చేసింది ఏమీలేదని ఆక్షేపించారు. కాళేశ్వరం పేరుతో మిగతా ప్రాజెక్టులను కేసీఆర్ పట్టించుకోలేదని ఫైర్ అయ్యారు. కాళేశ్వరం నీళ్లు లేకున్నా... భారతదేశ చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా పంటలు పండాయని నొక్కిచెప్పారు. ధాన్యం కొనుగోలు కోసం రూ.25 వేల కోట్లు రైతులకు కేటాయిస్తున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

## బీసీల వాదన వినకుండా కోర్టు ఏకపక్షంగా స్టే ఇచ్చింది: ఆర్.కృష్ణయ్య

హైదరాబాద్, అక్టోబర్ 14:: బీసీల వాదన వినకుండా తెలంగాణ హైకోర్టు ఏకపక్షంగా స్టే ఇచ్చిందని ఎంపీ, బీసీ రిజర్వేషన్స్ సాధన సమితి కన్వీనర్ ఆర్.కృష్ణయ్య వ్యాఖ్యానించారు. ఇవాళ(మంగళవారం) బీసీ సంఘాల తెలంగాణ బంద్ పోస్టర్స్‌ని ఆర్.కృష్ణయ్య, కోదండరాం, జాజుల శ్రీనివాస్ గౌడ్, బీసీ సంఘాల నేతలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మీడియాతో మాట్లాడారు. బీసీ రిజర్వేషన్స్‌పై హైకోర్టు స్టే ఇవ్వడంతో న్యాయం జరుగలేదని పేర్కొన్నారు. హైకోర్టు స్టే ఇచ్చి బీసీల నోటికాడి ముద్దను లాక్కుందని విమర్శించారు. బీసీలకు అవమానం, అన్యాయం జరిగిందని ఆర్.కృష్ణయ్య ఆవేదన వ్యక్తం చేశారు.

బీసీ సంఘాలు చెప్పిన అంశాలు ఆమోదయోగ్యంగా ఉన్నాయని టీజేఎస్ అధ్యక్షులు, ప్రొఫెసర్ కోదండరాం తెలిపారు. బీసీ బంద్‌కి ఇప్పటికే సంపూర్ణ మద్దతు ప్రకటించామని కోదండరాం పేర్కొన్నారు.

బీసీ రిజర్వేషన్స్‌ని అడ్డుకోవద్దని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ కోరారు. ఈ నెల 18వ తేదీన నిర్వహించే తెలంగాణ బంద్‌కి సంపూర్ణ మద్దతు తెలపాలని బీసీ జేఏసీ తెలంగాణ జన సమితి నేతలు తమ కార్యాలయానికి వచ్చి అడిగారని తెలిపారు. తమ కంటే ముందే బంద్‌కి కోదండరాం సంపూర్ణ మద్దతు తెలిపారని గుర్తుచేశారు. కోదండరాం మద్దతుతో బంద్ వందశాతం సక్సెస్ అయినట్లేనని చెప్పుకొచ్చారు. తెలంగాణ ఉద్యమాన్ని నడిపించిన నాయకుడు కోదండరాం అని ప్రశంసించారు జాజుల శ్రీనివాస్ గౌడ్.

తెలంగాణలోని రెండున్నర కోట్ల బీసీల హక్కుల కోసం ఈ బంద్ చేస్తున్నట్లు వివరించారు. తెలంగాణ సమాజం ఈ బంద్‌లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కులగణన చేపట్టిందని గుర్తుచేశారు. తెలంగాణ అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్స్ కోసం బిల్లు రూపకల్పన చేశారని తెలిపారు జాజుల శ్రీనివాస్ గౌడ్.

బీసీల నోటికాడి ముద్దను కొంతమంది లాక్కుంటున్నారని ఆరోపించారు. బీసీ రిజర్వేషన్స్ వ్యతిరేకులారా.. జనాభా దామాషా ప్రకారం తమ వాటా తమకు కావాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని సూచించారు. అఖిల పక్షాన్ని రాష్ట్రపతి, ప్రధానిని కల్పించాలని కోరారు. రాష్ట్రపతి, ప్రధాని అపాయింట్‌మెంట్ ఇవ్వకపోతే.. వారి ఇళ్ల ముందు ధర్నా చేపట్టాలని జాజుల శ్రీనివాస్ గౌడ్ సూచించారు.

## విశాఖ గూగుల్ ఏఐ హబ్.. భారత డిజిటల్ ఆర్థిక వ్యవస్థకు బలం: ప్రధాని మోదీ




న్యూఢిల్లీ, అక్టోబర్ 14:డైనమిక్ సిటీ విశాఖపట్నంలో గూగుల్ ఏఐ హబ్‌ను లాంచ్ చేయడంపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ హర్షం వ్యక్తం చేశారు. అన్ని కోణాల నుంచి వచ్చిన ఈ పెట్టుబడిలో గెగావాట్ - స్కేల్ డేటా సెంటర్ల రూపంలో మౌలిక సదుపాయాలు వికసిత్ భారత్‌కి దోహదం చేస్తాయని వ్యాఖ్యానించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ట్వీట్ చేశారు.

సాంకేతికతను ప్రజలందరికీ అందుబాటులోకి తేవడంలో విశాఖపట్నంలోని గూగుల్ ఏఐ హబ్ చాలా శక్తివంతంగా పనిచేస్తోందని అభివర్ణించారు. గూగుల్ ముందడుగు అందరికీ ఏఐ అనే నినాదానికి ఊతం ఇస్తోందని ఉద్ఘాటించారు. భారత పౌరులకు కటింగ్ ఎడ్జ్ టూల్స్ అందించడంలో ఎంతో ఉపకరిస్తోందని వివరించారు. మన డిజిటల్ ఆర్థిక వ్యవస్థకి సహకరించడంతోపాటు సాంకేతికతలో ప్రపంచంలో భారత్‌ని బలంగా నిలుపుతోందని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు.

మరోవైపు.. ఏపీలో ఏఐ హబ్, డేటా సెంటర్ ఏర్పాటుపై అంతర్జాతీయంగా అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్‌లో గూగుల్ అండ్ ఆల్ఫాబెట్ సీఈవో సుందర్ పిచాయ్ ట్వీట్ చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీతో మాట్లాడటం ఎంతో గొప్పగా ఉందని చెప్పుకొచ్చారు. మొట్టమొదటి గూగుల్ ఏఐ హబ్‌ని విశాఖపట్నంలో ఏర్పాటు చేస్తున్న సందర్భంగా తమ ప్రణాళికలు తెలియజేశానని పేర్కొన్నారు సుందర్ పిచాయ్.

ఏఐ హబ్ ఈ రంగంలో ఒక ల్యాండ్ మార్క్ అభివృద్ధిగా మారుతోందని ఉద్ఘాటించారు. ఈ హబ్‌లో గెగావాట్ - స్కేల్ కంప్యూట్ కెపాసిటీ, నూతన అంతర్జాతీయ సబ్ సీ గేట్‌వే ఉన్నాయని వివరించారు. అతిపెద్ద విద్యుత్ ఆధారిత మౌలిక సదుపాయలు ఉండనున్నాయని వెల్లడించారు. తమ మెరుగైన సాంకేతికతను భారతీయ పెట్టుబడుదారులకు, ప్రజలకు అందించే కార్యక్రమం ఇదని అభివర్ణించారు. దేశం మొత్తం ఏఐని మరింత వేగవంతం చేయడంలో.. మరిన్ని పరిశోధనలకు ఇది ఆస్కారం ఇస్తోందని గూగుల్ సీఈవో సుందర్ పిచ్చాయ్ పేర్కొన్నారు.

## కదులుతున్న బస్సులో మంటలు.. 15 మంది సజీవదహనం



న్యూఢిల్లీ, అక్టోబర్ 14: రాజస్థాన్ లోని జైసల్మేర్ లో మంగళవారంనాడు ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. థైయాట్ ప్రాంతంలోని మిలటరీ స్టేషన్ సమీపంలో కదుపుతున్న ప్రైవేటు ట్రావెల్ బస్సులో మంటలు చెలరేగి 15 మంది సజీవదహనమయ్యారు. మరో 25 మంది గాయపడ్డారు. బస్సులోంచి దట్టమైన పొగలు రావడంతో డ్రైవరు వెంటనే బస్సులు నిలిపివేశారు. నేషనల్ హైవేపై బస్సు వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకోవడంతో కిలోమీటర్ల వరకూ వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి.

బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో సమీపంలోని ఆర్మీ సిబ్బంది అక్కడకు చేరుకుని సహాయక కార్యక్రమాలు చేపట్టారు. అగ్నిమాపక శకటాలు రంగంలోకి దిగి చుట్టుపక్కలకు మంటలు విస్తరించకుండా వెంటనే అదుపులోనికి తెచ్చాయి. ఈ ప్రమాదంలో బస్సు పూర్తిగా కాలిపోయింది. అయితే అగ్నిప్రమాదానికి కారణం ఏమిటనేది వెంటనే తెలియలేదు.

## మాది న్యాయబద్ధమైన కోరిక.. 42శాతం రిజర్వేషన్‌పై పీసీసీ చీఫ్

న్యూఢిల్లీ, అక్టోబర్ 14: తెలంగాణ ప్రభుత్వం ఓబీసీలకు 42% రిజర్వేషన్ తీసుకొచ్చిందని.. 42% కోసం తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన జీవో చారిత్రాత్మకమని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. ప్రజల జీవితాలు బాగుపరచాలని చిత్తశుద్ధితో కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలు చేపట్టిందని తెలిపారు. అడుగడుగున బీజేపీ, బీఆర్ఎస్ వ్యతిరేకిస్తూ వచ్చినప్పటికీ తెలంగాణ ప్రభుత్వం ఎక్కడ వెనక్కు తగ్గలేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో ముందుకు వెళ్లామని చెప్పారు. ఆర్డినెన్స్ తీసుకొచ్చి జీవో ఇచ్చి ఎన్నికలకు వెళ్లేందుకు పూర్తి వివరాలతో హైకోర్టులో వాదించామని.. కానీ రాష్ట్ర హైకోర్టు జీవో 9 పై స్టే విధించిందన్నారు.

పాత రిజర్వేషన్ల ప్రకారమే ఎన్నికలకు వెళ్లాలని హైకోర్టు తీర్పు ఇవ్వడం బాధాకరమని పీసీసీ చీఫ్ అన్నారు. పూర్తి వివరాలతో హైకోర్టులో వాదించినప్పటికీ స్టే విధించారని తెలిపారు. హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వం తరఫున ఎస్ఎల్పీ దాఖలు చేశామని.. సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీతో దాదాపు గంట పాటు చర్చించినట్లు చెప్పారు. అన్ని విషయాలను కూలంకుషంగా చర్చించామన్నారు. గురువారానికి (ఈనెల 16) కేసు విచారణకు వచ్చే అవకాశం ఉందని అన్నారు.

హైకోర్టు పాత రిజర్వేషన్లతోనే ఎన్నికలకు వెళ్లాలని చెప్పిన నేపథ్యంలో బాధతో సుప్రీంకోర్టుకు వచ్చినట్లు వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వం తరఫున సుప్రీంకోర్టులో పిటిషన్ వేశామని.. న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను నిలుపుకునే విధంగా అసెంబ్లీలో బిల్లు పెడతే అన్ని పార్టీలు మద్దతు తెలిపాయని.. కానీ ఇప్పుడు మాట మార్చి బీజేపీ, బీఆర్ఎస్ వ్యతిరేకిస్తున్నాయని మండిపడ్డారు. 42% రిజర్వేషన్లు ఎక్కడా తగ్గకుండా ముందుకు వెళ్తున్నామని.. సుప్రీంకోర్టులో న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నామన్నారు. తమది న్యాయబద్ధమైన కోరిక అని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

కాగా.. సుప్రీంకోర్టులో సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీతో మహేష్ గౌడ్ ఈరోజు (మంగళవారం) భేటీ అయ్యారు. 42 శాతం రిజర్వేషన్లపై ప్రభుత్వం తరఫున గట్టి వాదనలు వినిపించాలని సీనియర్ న్యాయవాదిని మహేష్ కుమార్ గౌడ్ కోరారు.

## ఇఫ్కో సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి : శ్రీ కృపా శంకర్



నల్గొండ, అక్టోబర్ 14:: పురుగుల మందులు, డ్రోన్ స్ప్రేలు, ఎరువుల వినియోగంపై ఇఫ్కో అందిస్తున్న సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ఇఫ్కో మార్కెటింగ్ మేనేజర్ శ్రీ కృపా శంకర్ అన్నారు. మంగళవారం కట్టంగూర్ మండలంలోని అయిటిపాముల లోని కట్టంగూర్ ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్‌లో ఇఫ్కో షాపులను ప్రారంభించి మాట్లాడారు. రైతులు నానో యూరియాను వాడితే పంటలో మంది దిగుబడులు వచ్చి లాభాలను పొందవచ్చన్నారు. 500 ఎంఎల్ నానో యూరియా బాటిల్ 45 కిలోల యూరియాకు సమానమని తెలిపారు. ఆరుతడి పంటల వల్ల రైతు లకు పెట్టుబడి తగ్గి అధిక ఆధాయం వస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాబార్డు నల్లగొండ, సూర్యాపేట, భువనగిరి జిల్లా మేనేజర్ వెంకటేష్, రవీంద్రనాయక్, ఎఫ్‌పీఓ సలహాదారులు, మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహ్మారెడ్డి, ఐఆర్ డీఎస్ చైర్మన్ రమేష్, ఎఫ్‌పీఓ చైర్మన్ సైదమ్మ, డైరెక్టర్లు అనంతరెడ్డి, పుండరీకాక్షుడు, సురేష్, అంజయ్య, పాల్గొన్నారు.



# యువశక్తికి ప్రేరణగా నిలిచిన అబ్దుల్ కలాం సాఫల్య జీవితం

## (15 అక్టోబర్ 'అబ్దుల్ కలాం జయంతి - ప్రపంచ విద్యార్థి దినోత్సవం' సందర్భంగా)

'లీడ్ ఇండియా' అంటూ యువతను దేశాభివృద్ధి మహాయజ్ఞంలో పాలు పంచుకోవాలని పిలుపును ఇచ్చిన మన ప్రియతమ ఏ. పి. జె. అబ్దుల్ కలాం భరతమాత ముద్దు బిడ్డగా జాతి గౌరవాన్ని అంతర్జాతీయ వేదికల మీద చాటి చెప్పి అనన్య సామాన్యుడు, మేరునగ ధీరుడు, అనితరసాధ్య ఘనుడు. భారత 11వ రాష్ట్రపతిగా (2002–07) విశిష్ట సేవలందించి 'పీపుల్స్ ప్రెసిడెంట్'గా ప్రజల గుండెల్లో చెరగని ముద్రను వేసిన అవుల్ పకీర్ జైనులబ్దీన్ అబ్దుల్ కలాం 15 అక్టోబర్ 1931న ప్రముఖ దక్షిణ భారత తీర్థ స్థలం రామేశ్వరం పట్టణంలో పేద తమిళ ముస్లిమ్ కుటుంబంలో ఆశియమ్మ – జైనులబ్దీన్ దంపతులకు జన్మించారు. రామేశ్వరంలో పాఠశాల విద్య, తిరుచురాపల్లి సెయింట్ జోసెఫ్ కాలేజీలో భౌతిక శాస్త్రం (1954), మద్రాస్ యంఐటిలో ఏరోస్పేస్ ఇంజనీరింగ్ (1960) పట్టాలు పొందారు.

**మెసైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా:**

అతి సాధారణ విద్యార్థి దశ నుంచి అసాధారణ మేధావిగా కలాం ఎదిగిన క్రమం విలక్షణం, ఆశ్చర్యకరం. నాలుగు దశాబ్దాల ఉద్యోగపర్వంలో ఏరోస్పేస్ సైంటిస్ట్‌గా, సైన్స్ అడ్మినిస్ట్రేటర్‌గా విలక్షణ సేవలందించే క్రమంలో డిఆర్‌డిఓ (డిఫెన్స్ రీసర్చ్ అండ్ డెవలంప్‌మెంట్ ఆర్గనైజేషన్), ఇస్రో (ఇండియన్ స్పేస్ రీసర్చ్ ఆర్గనైజేషన్) సంస్థల్లో పరిపాలనాదక్షుడిగా, మిలటరీ మెసైల్ రూపశిల్పిగా తన సత్తా చాటి 'మెసైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా'గా కీర్తించబడ్డారు. ప్రధాని ముఖ్య వైజ్ఞానిక శాస్త్ర సలహాదారుగా, డిఆర్‌డిఓ సెక్రటరీగా 1992 నుంచి 1999 వరకు పని చేశారు. స్వావలంభన దిశగా భారతదేశాన్ని న్యూక్లియర్ ఎనర్జీ కలిగిన దేశంగా నిలపటానికి 1998లో పోక్రాన్–? పరీక్షలను పర్యవేక్షించి ప్రజల చేత జేజేలు అందుకున్నారు. భారత వాయు సేనలో ఫైటర్ పైలెట్‌గా పని చేయాలనుకున్న కలాం ఏరోస్పేస్ శాస్త్రజ్ఞుడిగా ఎవరికీ అందనంత ఎత్తుకు ఎదిగారు. ఇంజనీర్, సైంటిస్ట్, రచయిత, ఆచార్యులు, యువత ఆరాధ్య దైవం, ఆదర్శ రాజకీయవేత్త, యువతకు మార్గదర్శిగా బహుముఖీన ప్రతిభ కలిగిన అబ్దుల్ కలాం బోధనలు అనితరసాధ్యాలు. నేను చేయగలననే దృఢ సంకల్పమే విజయాలను అందిస్తుందని, ఎవరి తలరాతను వారే లిఖించుకోవాలని, నిజాయితీగల హృదయంతోనే అసలైన ఆకర్షణీయ వ్యక్తిత్వం వ్యక్తం అవుతుందని బోధనలు చేశారు. దేశ భవిత యువశక్తి మీదనే ఆధారపడి ఉందని నిరంతరం శ్రమించిన కలాం సేవలను గుర్తించి ఐరాస 15 అక్టోబర్ రోజు "ప్రపంచ విద్యార్థి దినోత్సవం (వరల్డ్ స్టూడెంట్స్ డే)" పాటించడం ఆయన విలక్షణ సేవలకు నిదర్శనంగా నిలుస్తున్నది.

**కలలు కందాం, సాకారం చేసుకుందాం:**

'ఉన్నత కలలు కనండి, సాకారానికి కఠోర సాధన చేయండి' అంటూ నినదించిన కలాం జీవితం తెరిచిన పుస్తకం, యువతకు మార్గదర్శకం. పడవలు నడిపే వృత్తిలో పేరుగాంచిన కలాం కుటుంబం, వ్యాపారంలో నష్టం రావడంతో కష్టాల కడలిలో పట్టుదలతో చదువులను కొనసాగిస్తూ, పేపర్ బాయ్‌గా పని చేస్తూ, ఏరోస్పేస్ ఇంజనీరింగ్‌ను పూర్తి చేయగలగడం నేటి యువతకు ప్రేరణాత్మకం. ఉద్యోగిగా తన సీనియర్స్ డా: విక్రమ్ సారాభాయ్, ఆచార్య సతీష్ ధవన్, డా: బ్రహ్మ ప్రకాశ్ లాంటి దిగ్గజాల వద్ద నాయకత్వ పటిమను, అంతరిక్ష శాస్త్రసాంకేతిక మెలకువలను నేర్చుకున్నారు. 1969లో ఇస్రోకు బదిలీ అయిన కలాం నేతృత్వంలో భారత తొలి స్వదేశీ పరిజ్ఞానంతో 'సాటలైట్ లాంచింగ్ వెహికిల్ (యస్‌యల్‌వి–3')ను రూపొందించుటలో విజయం సాధించారు. 1970–90ల మధ్య పియస్‌యల్‌వి (పోలార్ సాటలైట్ లాంచింగ్ వెహికిల్)తో పాటుగా యస్‌యల్‌వి–3లను అభివృద్ధి చేయుటలో ప్రధాన భూమికను నిర్వహించారు. 'బాలిస్టిక్ మెసైల్' టెక్నాలజీతో 'ప్రాజెక్ట్ డెవిల్', 'ప్రాజెక్ట్ వాలియంట్'లను రూపొందించడంలో మార్గదర్శనం చేశారు. ఇంటిగ్రేటెడ్ గైడెడ్ మెసైల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఐజియండిపి) ద్వారా కలాం చీఫ్ ఎగ్జిక్యూటివ్‌గా ? 3.88 బిలియన్ పెట్టుబడితో పరిశోధనలు కొనసాగించారు. 'అగ్ని', 'పృథ్వి'మెసైల్‌లను విజయవంతంగా నిర్మించగలిగారు. 1998లో చవకైన 'కలాం–రాజు కరోనరీ స్టంట్'ను, 2012లో 'కలాం–రాజు టాబ్లెట్' హెల్త్‌కేర్ కంప్యూటర్‌ను రూపొందించారు. టెక్నాలజీ సహాయంతో ఆర్థిక, వ్యవసాయ, ఆరోగ్య, విద్యారంగాలను పరిపుష్టం చేయవచ్చని గట్టిగా నమ్మిన కలాం ముందు చూపు అద్వితీయం. 'జననం సాధారణమే కావచ్చు, మరణం మాత్రం చరిత్ర సృష్టించేదిగా ఉండాలని' ఉద్బోధించారు.

**లీడ్ ఇండియా రూపశిల్పి:**

25 జూలై 2002న రాష్ట్రపతి పదవిని చేపట్టి భారత తొలి పౌరుడిగా 'ప్రజా రాష్ట్రపతి'గా పేరు తెచ్చుకున్నారు. భారత అత్యుత్తమ 'భారత రత్న'అవార్డు పొందిన ఏకైక తొలి సైంటిస్ట్, బాచిలర్ కలాం అనంతరం రాష్ట్రపతిగా విశిష్ట సేవలు అందించారు. రాష్ట్రపతిగా పదవీ విరమణ చేసిన అనంతరం అబ్దుల్ కలాం 'లీడ్ ఇండియా – 2020' ఉద్యమాన్ని ప్రారంభించి ఐదేళ్ళలో 5 లక్షల యువతకు మార్గదర్శకం చేయాలనే లక్ష్యాన్ని ఛేదించుటకు కృషి చేశారు. నేటికీ కలాం స్థాపించిన 'లీడ్ ఇండియా ఫౌండేయన్' అనబడే 2వ స్వాతంత్ర్య ఉద్యమాన్ని తన అభిమానులు 'లీడ్ ఇండియా నేషనల్ క్లబ్స్' వేదికగా యువతను సన్మార్గంలో నిలిపే "లీడ్ ఇండియా మిషన్ – 2047" వేదికగా పలు అసమాన్య సేవలను నిరంతరం కొనసాగించడం హర్షదాయకం. అనేక అగ్ర విద్యాసంస్థలు ఐఐయం, ఐఐయస్‌సి, ఐఐటి, బిహెచ్‌యు, అన్నా విశ్వవిద్యాలయాలకు విజిటింగ్ ఫ్రొఫెసర్‌గా అమూల్య సేవలు, అనుభవసారాలు అందజేశారు. తన జీవితకాలంలో 40కి పైగా విశ్వవిద్యాలయాల నుంచి గౌరవ డాక్టరేట్లు అందుకోగలిగారు.

పురస్కారాలే పులకించిన వేళ:

అత్యుత్తమ పౌర పురస్కారం భారత రత్నతో పాటు పద్మవిభూషణ్, పద్మ భూషన్, ఇందిరా గాంధీ జాతీయ సమైక్యత ఆవార్డు, వీర సావర్కర్, శస్త్ర రామానుజన్, వాన్ బ్రాన్ లాంటి పలు ఆవార్డులతో సన్మానాలు అందుకున్నారు. తన అనుభవాలను, ఆలోచనలను భవిష్యత్ తరాలకు అందించాలనే సదుద్దేశ్యంతో 'వింగ్స్ ఆఫ్ ఫైర్', 'ఇండియా–2020', 'ఇగ్నైటెడ్ మైండ్స్', 'ఇండామిటబుల్ స్పిరుట్స్' లాంటి పలు పుస్తకాలు రచించారు. 26 జూలై 2015న ఐఐయం, షిల్లాంగ్‌లో విద్యార్థి యువతతో ముచ్చటిస్తూనే 83వ ఏట తుది శ్వాస విడిచిన ఏ. పి. జె. అబ్దుల్ కలాం జీవితం ఆసాంతం అనుసరణీయం, సదా స్మరణీయం. బలమైన విజయకాంక్షతోనే అపజయాలను అధిగమించాలని, విద్య రెక్కలతోనే ఎదిగాలంటూ నినదించిన కలాం దార్శనికత పరమ పవిత్రం, ప్రగతికి ఇంధనం.

'సక్సెస్ అంటే మన సంతకం ఆటోగ్రాఫ్‌గా మారాడమే' అన్న కలాం 'కల అంటే నిద్రలో వచ్చేది కాదని, నిద్ర పోనివ్వకుండా విజయం వరించే దాకా మనల్ని కార్యోన్ముఖులను చేసేది' అని నమ్మిన అపూర్వ మూర్తిమత్వ నిధి మన అజేయ అబ్దుల్ కలాం సామాన్య ప్రజల మదిలో తిష్టవేసిన ప్రేరణామూర్తి, నిత్య చైతన్య స్ఫూర్తి.

– డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# వ్యవసాయ రంగంలో సాధించిన పురోగతిపై వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ సమీక్ష

న్యూఢిల్లీ, అక్టోబర్ 14:వ్యవసాయ రంగంలో సాధించిన పురోగతిని సమీక్షించేందుకు కేంద్ర వ్యవసాయం, రైతు సంక్షేమం, గ్రామీణాభివృద్ధి మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ అధ్యక్షతన ఈ రోజు ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. ఖరీఫ్ పంట పరిస్థితులు, రబీ నాట్ల సన్నద్ధత, వరద ప్రభావిత ప్రాంతాల్లో పంటల పరిస్థితి, ధరల స్థితిగతులు, ఎరువుల లభ్యత, రిజర్వాయర్లలో నీటిమట్టాల స్థాయిలకు సంబంధించి ఈ సమావేశంలో సమగ్రంగా చర్చించారు. అలాగే సంబంధిత అధికారులకు అవసరమైన ఆదేశాలను సైతం కేంద్ర మంత్రి జారీ చేశారు.

గతేడాదితో పోలిస్తే ఖరీఫ్ పంటల సాగు విస్తీర్ణం 6.51 లక్షల హెక్టార్లు పెరిగిందని అధికారులు తెలియజేశారు. మొత్తం సాగు విస్తీర్ణం 1,121.46 లక్షల హెక్టార్లకు చేరుకుంది. ఇది 2024?25లో 1,114.95 లక్షల హెక్టార్లుగా ఉంది. గతేడాదితో పోలిస్తే ప్రధాన పంటలైన గోధుమ, వరి, జొన్న, చెరకు, పప్పు ధాన్యాల సాగు రికార్డు స్థాయిలో పెరిగిందని వివరించారు. మినుము సాగు విస్తీర్ణం 2024?25లో 22.87 లక్షల హెక్టార్ల నుంచి 2025?26లో 24.37 లక్షలకు అంటే 1.50 లక్షల హెక్టార్ల మేర పెరిగింది.

వరద ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితిని సైతం కేంద్ర మంత్రి సమీక్షించారు. కొన్ని రాష్ట్రాల్లో వరదలు, కొండచరియలు విరిగి పడిన ప్రభావిత జిల్లాలను శ్రీ చౌహాన్ ఇటీవల సందర్శించారు. అధిక వర్షపాతం కారణంగా కొన్ని ప్రాంతాల్లో పంటలు దెబ్బలు తిన్నప్పటికీ, మరికొన్ని ప్రాంతాలు రుతుపవనాల కారణంగా లబ్ధి పొందాయని, ఫలితంగా రబీ నాట్లు, మొత్తం దిగుబడిని పెంచేలా పంట వస్తుందని అంచనా వేస్తున్నట్లు తెలియజేశారు.

టొమాటో, ఉల్లి సాగు ప్రక్రియ సజావుగా సాగుతోందని అధికారులు తెలియజేశారు. ఉల్లిసాగు విస్తీర్ణం 2024?25లో 3.62 లక్షల హెక్టార్ల నుంచి ప్రస్తుతం 3.91 లక్షల హెక్టార్లకు పెరిగింది. అదే సమయంలో బంగాళాదుంప సాగు 0.35 లక్షల హెక్టార్ల నుంచి 0.43 లక్షల హెక్టార్లకు పెరిగింది. అదేవిధంగా.. టొమాటో సాగు విస్తీర్ణం గతేడాది 1.86 లక్షల హెక్టార్ల నుంచి ఈ ఏడాది 2.37 లక్షల హెక్టార్లకు విస్తరించింది. నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా బంగాళాదుంప, ఉల్లి, టొమాటో సాగు విస్తీర్ణం పెరుగుతోందని సమావేశంలో గుర్తించారు.

# 16న కర్నూలులో ప్రధాని మోదీ పర్యటన

అమరావతి, అక్టోబర్ 14: మోదీ పర్యటన రాయలసీమకు నూతన ఉత్సాహాన్ని అందిస్తుందని బీజేపీ మాజీ ఎంపీ టీజీ వెంకటేష్ ఎర్కొన్నారు. మోదీ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజల నుంచి ఆదరణ లభిస్తోందని తెలిపారు. మంగళవారం ఆయన కర్నూలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశానికి ఆర్థికంగా బలాన్నిచ్చిన జీఎస్టీ సంస్కరణలు మోదీ ఆలోచనలకు ప్రతిబింభం అని, ప్రజలపై భారాన్ని తగ్గించే దిశగా జీఎస్టీ సవరణలు తీసుకొచ్చారని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి దిశగా కేంద్రం సహకారం కొనసాగిస్తుందని ఆయన స్పష్టం చేశారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు , రాష్ట్ర మంత్రి టీజీ భరత్ తరచూ కేంద్రాన్ని కలిసి పరిశ్రమలు, పెట్టుబడులు తెచ్చే ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రానికి ఆర్థిక ఇబ్బందులు ఉన్న సమయంలో బీజేపీ అండగా నిలుస్తుందని తెలిపారు. రాయలసీమలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుల పూర్తి కోసం కేంద్రం పెద్ద ఎత్తున బడ్జెట్ కేటాయించిందని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం కాలంలో కర్నూలు, నంద్యాల జిల్లాల్లో పరిశ్రమల స్థాపన మళ్లీ వేగంగా సాగుతోందని తెలిపారు. "రాయలసీమ హక్కుల ఐక్య వేదిక రాజధాని కర్నూలులో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.. కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు కూడా కేంద్రం సానుకూలంగా స్పందించిందని తెలిపారు. భవిష్యత్తులో కర్నూలును సమ్మర్ క్యాపిటల్, వింటర్ క్యాపిటల్గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని ఆయన భరోసా ఇచ్చారని తెలిపారు.

బీజేపీ రాయలసీమ డిక్లరేషన్ ప్రకారం ఇచ్చిన హామీలను అమలు చేస్తోందని టీజీ వెంకటేష్ పేర్కొన్నారు. హైకోర్టు బెంచ్ ఏర్పాటు కచ్చితంగా జరుగుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. మోదీ పర్యటనను విజయం చేయాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు.

# ప్రధాని పర్యటన ప్రాంతాల్లో పకడ్బందీ భద్రత

## –డీజీపీ స్వయం పర్యవేక్షణ

శ్రీశైలం, అక్టోబర్ 14: దేశ ప్రధాని శ్రీ నరేంద్రమోదీ ఈనెల 16వ తేదీన నంద్యాల జిల్లా శ్రీశైలంలో పర్యటించి శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామిని దర్శించుకోనున్న తరుణంలో.. పకడ్బందీ బందోబస్తుకు 1800 మంది పోలీస్ అధికారులు, సిబ్బందితో పటిష్ట ఏర్పాట్లు చేసినట్లు నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్ తెలిపారు. మంగళవారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రధానమంత్రి హెలిపాడ్ కు చేరుకున్నప్పటి నుంచి దర్శనం అనంతరం రిగి వెళ్లే వరకు ఆయన భద్రతపైనే పోలీసులు ఫోకస్ పెట్టారు.

ఆనయ పర్యటించే ప్రాంతాలలో విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారు. ముఖ్య ప్రాంతాలల్లో, కూడళ్లల్లో సాయిధ బలగాలతో పికెట్లను ఏర్పాటు చేశారు. బందోబస్తు విధుల్లోని సిబ్బందిని 10 సెక్టార్లుగా విభజించి ప్రతి సెక్టార్(రావఇబి)కు ఒక ఉన్నతాధికారిని ఇన్ చార్జీని నియమించారు. జియో గ్రాఫికల్ మ్యాప్ తో ప్రధాని పర్యటించే ప్రాంతాలలో భద్రత చర్యలను క్షుణ్ణంగా సిబ్బందికి జిల్లా ఎస్పీ వివరించారు . రోడ్డు మార్గాల్లో, ముఖ్య కూడళ్లలో, గుడి పరిసర ప్రాంతాలలో రూఫ్ టాప్ సిబ్బందిని నియమించారు.

వీరికి బైనాక్యులర్ తో



అప్రమత్తంగా ఉంటారు. శ్రీశైలానికి వచ్చే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీచేయాలని ఇది 24/7 కొనసాగించాలని ఎస్పీ ఆదేశించారు. కమాండ్ కంట్రోల్లోని సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటూ కెమెరాలను పరిశీలించాలని ఏదైనా అనుమానాస్పదంగా ఉంటే వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించాలన్నారు. హెలిపాడ్, గుడి, శివాజీ స్ఫూర్తి కేంద్రం ప్రాంతాలలో ప్రవేశ నిష్క్రమణ మార్గాలలో యాక్సెస్ కంట్రోల్ ఏర్పాటు చేసి క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించాలన్నారు.

శివాజీ స్ఫూర్తి కేంద్రం వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా క్రౌడ్ కంట్రోల్ కొరకు రూఫ్ టాప్, క్యూఆర్టీ , స్పెషల్ పార్టీలను నియమించాలని ఆదేశించారు .

ప్రధాని పర్యటనకు వచ్చిన సుమారు 1800 మంది పోలీస్ అధికారులు సిబ్బందికి ప్రత్యేక డ్యూటీ పాసులను ఆత్రేయ డిజిటల్స్ సహకారంతో ఏర్పాటు చేశామని ఎస్పీ వివరించారు. డ్యూటీలోని పోలీసు అధికారులు సిబ్బంది ప్రతి ఒక్కరూ ఐడీ కార్డులు ధరించాలన్నారు. రెవెన్యూ అధికారులు ఇచ్చిన గుర్తింపు పాసులను తప్పనిసరిగా క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు.

ఏపీ డీజీపీ పర్యవేక్షణ

శ్రీశైలంలో ప్రధాని పర్యటనకు బందోబస్తు ఏర్పాట్లను ఏపీ డీజీపీ హరీష్ కుమార్ గుప్తా మంగళవారం పర్యవేక్షించారు.

ప్రధాని చేరుకునే హెలిపాడ్, రోడ్డు మార్గం, భ్రమరాంబ గెస్ట్ హౌస్, శివాజీ స్ఫూర్తి కేంద్రం ,గుడి పరిసర ప్రదేశాలు, సేఫ్ హౌస్ తదితర ప్రాంతాలలో భద్రత ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కర్నూలు రేంజి డీఐజీ కోయ ప్రవీణ్,ఈగల్ టీం ఐజీ ఆకే. రవికృష్ణ , నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్, అదిరాజ్ సింగ్ రాణా, ఏఎస్పీ ఎం.జావళి, ఆత్మకూరు డీఎస్పీ రామాంజి నాయక్ పాల్గొన్నారు.

# 'ప్రధానమంత్రి గతిశక్తి'కి నాలుగేళ్లు: వివిధ పరిణామాత్మక కార్యక్రమాలకు కేంద్ర వాణిజ్య-పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ పీయూష్ గోయల్ శ్రీకారం

న్యూఢిల్లీ, అక్టోబర్ 14:'ప్రధానమంత్రి గతిశక్తి జాతీయ బృహత్ప్రణాళిక' (ఎన్ఎంపీ)కు నాలుగేళ్లు పూర్తయిన నేపథ్యంలో కేంద్ర వాణిజ్య–పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ పీయూష్ గోయల్ ఇవాళ వివిధ పరిణామాత్మక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. అంతర్గత వాణిజ్యం–పరిశ్రమల ప్రోత్సాహక విభాగం (డీపీఐఐటీ)లోని లాజిస్టిక్స్ విభాగం ఈ కార్యక్రమాలను రూపొందించింది. మౌలిక సదుపాయాల ప్రణాళిక బలోపేతం, చివరి అంచెదాకా అనుసంధానం మెరుగుదల, సమగ్రాభివృద్ధికి తోడ్పడే మౌలిక వసతులకు భరోసా ద్వారా సామాజిక–ఆర్థిక ప్రగతిని వేగిరపరచడమే వీటి లక్ష్యం.

ఈ సందర్భంగా కేంద్ర మంత్రి శ్రీ గోయల్ మాట్లాడుతూ– వివిధ రాష్ట్రాల పరిధిలోని 28 ఆకాంక్షాత్మక జిల్లాల కోసం కేంద్ర ప్రభుత్వం 2024 అక్టోబరులో 'పీఎం గతిశక్తి' కింద జిల్లాస్థాయి బృహత్ప్రణాళికను రూపొందించి, అమలులోకి తెచ్చిందని గుర్తుచేశారు. 'పీఎం గతిశక్తి' వేదిక ద్వారా పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు, అంగన్‌వాడీలు, రోడ్లు, నీటి సరఫరా పైపులైన్ల వంటి కీలక సామాజిక–ఆర్థిక మౌలిక సదుపాయాల కల్పన సంబంధిత భూగోళ–ప్రాదేశిక ప్రణాళికల అమలుకు 'డీఎంపీ' తోడ్పడుతుంది.

పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు, అంగన్‌వాడీలు, రోడ్లు, నీటి సరఫరా పైప్‌లైన్ల నిర్మాణం దిశగా ఐదు రంగాల్లో ప్రణాళికల సమర్థ రూపకల్పన లక్ష్యంగా నిర్దిష్ట ఉపకరణాలను రూపొందించారు. అటుపైన భాగంగా 2024 డిసెంబరులో గుజరాత్‌లోని గాంధీనగర్‌లో 'బైశాగ్–ఎన్' వద్ద జిల్లాస్థాయి బృందాల కోసం సమగ్ర సామర్థ్య వికాస శిక్షణ శిబిరాలను ప్రారంభించారు. ఆ తర్వాత ఇతర రాష్ట్రాలు, జిల్లాల స్థాయి అధికారుల కోసం క్రమం తప్పకుండా ప్రాంతీయ వర్క్ షాప్‌లు, ఆన్‌లైన్ కార్యక్రమాలు నిర్వహించారు.

అనంతరం రూపొందించిన ప్రణాళికల కింద గుజరాత్‌లోని జిల్లాల వరిధిలో దామోహ్–జబల్‌పూర్ రహదారి 2 నుంచి 4 వరుసలకు విస్తరణ, దామోహ్‌లో సౌరపార్కుల ఏర్పాటు స్థల ఎంపిక, పాలన సరిహద్దు ప్రణాళిక, జల్ జీవన్ మిషన్ కింద తాగునీటి సరఫరా, కరెంటు లేని గ్రామాల్లో విద్యుదీకరణ, అనుసంధానం సదుపాయం లేని ఆవాసాలకు రహదారుల నిర్మాణం, బరాన్ జిల్లాలో వాటర్‌షెడ్ నిర్వహణ ప్రణాళిక వంటి అమలు వంటి ఆచరణాత్మక కార్యకలాపాలు కొనసాగించారు.

ఈ విజయాలు ప్రాతిపదికగా 'పీఎంజీఎస్–డీఎంపీ'ని ఇప్పుడు 112 ఆకాంక్షాత్మక జిల్లాల్లో దశలవారీగా అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా దేశమంతటా సామాజిక–ఆర్థిక మౌలిక సదుపాయాల కల్పన కోసం డేటా ఆధారిత, సమగ్ర ప్రణాళిక అమలుకు శ్రీకారం చుట్టారు.

శ్రీ గోయల్ ప్రారంభించిన వాటిలో మౌలిక సదుపాయాల ప్రణాళిక, డేటా ఆధారిత నిర్ణయ విధానం, వివిధ రంగాల మధ్య సహకార విస్తృతి లక్ష్యంగా పలు పరిణామాత్మక కార్యక్రమాలున్నాయి. వీటిలో నాలెడ్జ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (కేఎంఎస్), వికేంద్రీకృత డేటా అప్‌లోడింగ్–నిర్వహణ వ్యవస్థ (డీయూఎంఎస్), బహుళ–రంగ, సమీకృత నివేదన వ్యవస్థ, 'పీఎంజీఎస్–ఎన్ఎంపీ' డాష్‌బోర్డ్, 'పీఎం గతిశక్తి' సంగ్రహ సంపుటం–3 కూడా భాగంగా ఉన్నాయి.

గడచిన నాలుగేళ్లుగా కేంద్రంలోని వివిధ మంత్రిత్వ శాఖలు, రాష్ట్రాలు వినూత్న చర్యలు చేపట్టాయని శ్రీ పీయూష్ గోయల్ ఈ సందర్భంగా చెప్పారు. ఇందులో భాగంగా డిజిటల్ ఉపకరణాలను రూపొందించాయని, మౌలిక సదుపాయాల కల్పన, నిర్ణయాత్మకత మెరుగుదల కోసం భూగోళ–ప్రాదేశిక ప్రణాళిక వినియోగం పద్ధతులకు రూపకల్పన చేశాయని వివరించారు. డిజిటల్ ఉపకరణాలు, వినియోగ ఉదాహరణలు, 'ఎస్ఓపీ'లు, సంకలనాలు, శిక్షణ వనరులు తదితరాలకు నాలెడ్జ్ మేనేజ్‌మెంట్ వ్యవస్థ (కేఎంఎస్) ఓ కేంద్రీకృత భాండాగారంగా ఉపయోగపడుతుంది. అలాగే వివిధ మంత్రిత్వ శాఖలు–విభాగాలు, రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాల్లో అనుసరణ, పరిమాణ వృద్ధి, పరస్పర నైపుణ్యాభివృద్ధి బలోపేతం తదితరాలను ఈ వ్యవస్థ ప్రోత్సహిస్తుంది.

'కేఎంఎస్'లో సమీకృత 'ఎన్ఎంపీ' డాష్‌బోర్డ్ అత్యంత ప్రధాన భాగం. ఇది అందుబాటులోగల సమాచార దశలు, నవోదిత వినియోగదారులు, ప్రణాళికాబద్ధ ప్రాజెక్టులు, నివేదిత అంశాలపై ప్రత్యక్ష అవగాహనకు ఉపయోగపడుతుంది. బహుళ–రంగ, సమగ్ర నివేదన వ్యవస్థకు ప్రాతిపదికగా ఉంటుంది. వికేంద్రీకృత డేటా అప్‌లోడింగ్–నిర్వహణ వ్యవస్థ దీనికి అనుబంధంగా ఉంటుంది. నిర్దిష్ట నిర్వహణ వ్యవస్థల ద్వారా డేటా అప్‌లోడ్ సంబంధిత మూడు–దశల వర్క్ ఫ్లో, నోడల్ అధికారుల సమీక్ష సహా బైశాగ్–ఎన్' ద్వారా తుది నివేదనతో కచ్చితమైన, ఏకరూప, జవాబుదారీ సమాచార నిర్వహణకు భరోసా ఇస్తుంది. అలాగే పారదర్శకత, కార్యాచరణ సామర్థ్యం, బహుళ–రంగాల సమన్వయం మెరుగుపడేందుకు తోడ్పడుతుంది.

మౌలిక సదుపాయాలు, సామాజిక–ఆర్థిక రంగాల్ల విస్తృత క్షేత్రస్థాయి విజయగాథలను 'పీఎం గతిశక్తి సంగ్రహ సంపుటం–3' ప్రస్ఫుటం చేస్తుంది. దేశవ్యాప్తంగా సమగ్రాభివృద్ధికి దోహదం చేయడంలో, అనుసంధానం మెరుగుదలలో సర్వతోముఖ వృద్ధికి తోడ్పాటులో 'పీఎం గతిశక్తి'కిగల పరిణామాత్మక ప్రభావాన్ని చాటుతుంది.

ఈ కార్యక్రమాలు ప్రారంభమైన నేపథ్యంలో సమగ్ర మౌలిక సదుపాయాల ప్రణాళిక, డేటా–ఆధారిత పాలన, సమగ్రాభివృద్ధిలో కొత్త ప్రమాణాలను నిర్దేశిస్తూ– ఆధునిక, అనుసంధానిత, పునరుత్థాన భారత్ దృక్కోణాన్ని 'పీఎం గతిశక్తి' మరింత బలోపేతం చేస్తుంది.

# ఆటోవాలా ఆనందోత్సాహం

## –తిరువూరులో భారీ ర్యాలీ

## –ఎమ్మెల్యే కొలికపూడికి నీరాజనం

అమరావతి, అక్టోబర్ 14: కూటమి ప్రభుత్వం ఆటో డ్రైవర్ల సేవలో భాగంగా ఆర్థిక సహాయాన్ని అందజేసిన నేపథ్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి కృతజ్ఞతగా తిరువూరు పట్టణంలో మంగళవారం ఆటో డ్రైవర్లు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. తిరువూరు శాసనసభ్యుడు కొలికపూడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీ సందర్భంగా సీఎం చంద్రబాబునాయుడికి కృతజ్ఞతలు అభినందనలు తెలిపారు.

పట్టణంలోని అయ్యప్ప స్వామి గుడి నుంచి మధిర రోడ్డులోని ఎన్టీఆర్ విగ్రహం వరకు వందలాది ఆటోలతో భారీ ర్యాలీ నిర్వహించిన అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే కొలికిపూడి శ్రీనివాసరావు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం ప్రధాని మోదీ సీఎం చంద్రబాబు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఆటో డ్రైవర్ల అందరికీ ఆర్థిక సహాయం చేసిన కూటమి ప్రభుత్వానికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని ఆటో డ్రైవర్లు తెలిపారు.

# ప్రాంత అభివృద్ధికి అంకితభావంతో సేవలు

## –ప్రాంత అభివృద్ధికి అంకితభావంతో సేవలు

## –ఇంజనీరింగ్ రంగంలో చిరస్మరణీయ కీర్తి

కర్నూలు, అక్టోబర్ 14: రాయలసీమకు తాగునీరు, సాగునీరు అందించడమే జీవిత ధ్యేయంగా భావించిన ప్రముఖ ఇంజనీర్, గుండ్రేవుల రూపకర్త, రాయలసీమ నీటి ప్రాజెక్టుల శిల్పి ఎం. సుబ్బరాయుడు(రిటైర్డ్ ఇంజనీర్) మంగళవారం ఉదయం 8.10 గంటలకు కర్నూలులో కన్నుమూశారు.

ఆయన మరణవార్త తెలిసిన వెంటనే సహచరులు, ఇంజనీర్ వర్గాలు రాయలసీమలోని పలు ప్రజా సంఘాలు, ప్రజలు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. సుబ్బరాయుడు రాష్ట్ర ఇరిగేషన్ శాఖలో విశిష్ట సేవలు అందించి పదవీ విరమణ చేశారు. అయితే పదవీ విరమణ తర్వాత కూడా ఆయన ఆగలేదు. రాయలసీమ ప్రాంతం నీటివనరుల పరంగా అభివృద్ధి చెందాలనే సంకల్పంతో పలు ప్రాజెక్టులకు రూపకల్పన చేశారు. గుండ్రేవు ప్రాజెకతో పాటు రాయలసీమ అంతటా సాగునీటి సౌకర్యాల విస్తరణకు అంకితభావంతో కృషి చేశారు. ఆయన ఆలోచనలు, సాంకేతిక పథకాలు అనేకం ప్రస్తుతం రైతులకు, ప్రజలకు సాగు, తాగునీరు అందిస్తున్నాయి. వీటితోపాటు అనేక నూతన ప్రాజెక్టులకు పునాది వేశాయి.

రాయలసీమ నీటి సమస్య పరిష్కారానికఆయన చేసిన కృషి అమూల్యమని సహచరులు, ప్రజాప్రతినిధులు స్మరించారు. రాయలసీమకు నీరు అందించాలన్నది ఆయన జీవిత లక్ష్యం. ఎలాంటి పరిస్థితుల్లోనూ ఆ సంకల్పం నుంచి వెనక్కి తగ్గలేదు అని ఇంజనీర్ వర్గాలు తెలిపారు.

ప్రాంత ప్రజల సంక్షేమం కోసం సుబ్బరాయుడు వేసిన అడుగులు, ప్రణాళికలు రాబోయే తరాలకు మార్గదర్శకంగా నిలుస్తాయని పలువురు భావిస్తున్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు భగవంతుడు ధైర్యం ప్రసాదించాలని అందరూ ప్రార్థిస్తున్నారు.

# రైతు ఆత్మహత్యాయత్నం

హైదరాబాద్, అక్టోబర్ 14: దుండిగల్ మండలం తహసీల్దార్ కార్యాలయం ముందు ఓ యువ రైతు ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డ ఘటన ఈ రోజు చోటుచేసుకుంది. దుండిగల్ తండా 2కు చెందిన యువ రైతు సిద్దు సర్వే నెంబర్ 148, 150లోని భూదాన్ భూమిలో తనకు పట్టా, పాస్ బుక్‌లు జారీ చేయాలని కొన్ని రోజులుగా స్థానిక తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతూ అధికారులను అర్జిస్తున్నాడు.

తనకు కోర్టు ఆర్డర్ కాపీ ఉందని గతంలోనే రెవెన్యూ అధికారులకు సదరు కోర్టు కాపీలను అందజేశారు. తనభూమికి హద్దులు ఏర్పాటు చేయాలని ఏంఆర్ఓ ఆఫీసలో విన్నవించినప్పటికీ అధికారులు సర్వేకు రావడం లేదని కార్యాలయం చుట్టూ తిప్పించుకుంటున్నారని, అంతేకాకుండా రూ. 6లక్షలు డిమాండ్‌చేశారని రైతు సిద్దు ఆరోపించారు. ఇదిలా ఉంటే తన భూమిని ఓ బడా నిర్మాణ సంస్థకు కట్టబెట్టేందుకు రెవెన్యూ అధికారులు యత్నిస్తున్నారని ఆరోపించారు.

ఈ రోజు రైతు సిద్ధు కు, కార్యాలయంలోని సిబ్బందికి వాదోపవాదాలు జరగడంతో మనస్తాపం చెందిన యువ రైతు సిద్దు కార్యాలయం ముందు తనతో పాటు తెచ్చుకున్న పెట్రోల్‌ను ఒంటిమీద పోసుకుని చేతిలో లెటర్‌ను చూపిస్తూ రెవెన్యూ అధికారుల తీరుతోనే తాను ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు పేర్కొన్నాడు.

# సమీకృత ఆఫ్‌షోర్ ప్రణాళికను సమర్థవంతంగా మార్చేందుకు, భారత నీలి ఆర్థిక వ్యవస్థను పెంచేందుకు ఉద్దేశించిన పీఎం గతిశక్తి - ఆఫ్‌షోర్ ప్రారంభం

న్యూఢిల్లీ, అక్టోబర్ 14:ప్రధానమంత్రి గతిశక్తి జాతీయ మాస్టర్ ప్లాన్‌కు (ఎన్ఎంపీ) నాలుగు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ రోజు ఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో వాణిజ్యం, పరిశ్రమల మంత్రిత్వ శాఖకు చెందిన పరిశ్రమ, అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక విభాగంలోని (డీపీఐఐటీ) రవాణా విభాగం 'పీఎం గతిశక్తి - ఆఫ్‌షోర్'ను ప్రారంభించింది. ఈ కార్యక్రమానికి కేంద్ర వాణిజ్యం, పరిశ్రమల మంత్రి శ్రీ పియూష్ గోయల్ అధ్యక్షత వహించారు.

పీఎం గతిశక్తి కార్యక్రమంలో భాగంగా ఉన్న పీఎం గతిశక్తి-ఆఫ్‌షోర్‌ను.. సముద్రాలపై అభివృద్ధికి సంబంధించిన సమగ్ర ప్రణాళిక, నిర్వహణ కోసం డిజిటల్ వేదికగా అభివృద్ధి చేశారు. ఈ వేదిక సముద్రాలపై పవన విద్యుత్పత్తి కేంద్రాలు, సముద్ర వనరుల అన్వేషణ, తీరప్రాంత మౌలిక సదుపాయాల అభివృద్ధి వంటి ప్రాజెక్టుల విషయంలో డేటా ఆధారంగా నిర్ణయాలు తీసుకునేందుకు వీలు కల్పించనుంది. దీని కోసం వివిధ ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు, విభాగాల నుంచి కీలకమైన డేటాసెట్‌లను సమీకృతం చేస్తూ ఏకీకృత జియోస్పేషియల్ వేదికను అందిస్తుంది. భారతదేశ నీలి ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం.. హరిత విద్యుత్, సుస్థిర తీరప్రాంతాభివృద్ధి వైపు భారత్ పరివర్తన చెందేందుకు తోడ్పాటునందించే లక్ష్యంతో ఇది పనిచేస్తుంది.

ఈ వేదిక నూతన - పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖ, పర్యావరణం- అటవీ- వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ, పెట్రోలియం- సహజ వాయువు మంత్రిత్వ శాఖ, ఓడరేవులు- నౌకాయానం- జలమార్గాల మంత్రిత్వ శాఖ, మత్స్య శాఖ, గనుల మంత్రిత్వ శాఖ, విద్యుత్ మంత్రిత్వ శాఖ, టెలికమ్యూనికేషన్ల శాఖ వంటి కీలక మంత్రిత్వ శాఖలు, విభాగాల నుంచి డేటాసెట్‌లను ఏకీకృతం చేసే ఏకోన్ముఖ ప్రభుత్వ విధానాన్ని కలిగి ఉంది. వివిధ మంత్రిత్వ శాఖలు ఆటంకం లేకుండా ఏకీకరణతో పనిచేయటం వల్ల భారత్‌కు విస్తృతంగా ఉన్న తీరప్రాంతేతర సామర్థ్యాన్ని సమగ్ర ప్రణాళిక, సమర్థవంతంగా ఉపయోగించుకోవడానికి వీలు కల్పిస్తుంది.

శక్తి- వనరులు, పర్యావరణం- జీవావరణం, మౌలిక సదుపాయాలు- లాజిస్టిక్స్.. సముద్ర, ప్రమాద డేటా వంటి విభాగాల కింద వర్గీకరించిన భౌగోళిక ప్రాదేశిక అంచెలకు సంబంధించిన విస్తృతమైన డేటా ఈ పోర్టల్‌లో ఉంటుంది. సముద్రాలపై పవన విద్యుత్, సౌర- ఆటుపోట్లు- అలలు - సముద్ర ఉష్ణ శక్తి ఉత్పత్తి సామర్థ్యం.. చమురు- గ్యాస్ క్షేత్రాలు, పైప్‌లైన్‌లు.. సముద్రాల లోతు, అవక్షేపణ బేసిన్లు.. తీరప్రాంత నియంత్రణ మండలాలు.. పగడపు దిబ్బలు, మడ అడవులు, సముద్ర క్షీరదాల కేంద్రాలు.. ఓడరేవులు, విమానాశ్రయాలు, విద్యుత్ మౌలిక సదుపాయాలు, చేపల రేవులు.. ఉపరితల ప్రవాహాలు, తరంగాలు ఎత్తు, భూకంప ప్రమాద మండలాలు వంటి సముద్ర, ప్రమాద సూచికలతో పాటు వివరణాత్మక డేటాసెట్‌లు వీటిలో ఉన్నాయి. ఈ డేటా ప్రణాళిక సంస్థలు, నియంత్రణ సంస్థలు, పెట్టుబడిదారులకు స్థిరమైన, సాంకేతికంగా వెసులుబాటు అయ్యే నిర్ణయం తీసుకునేందుకు కావాల్సిన వివరాలను అందిస్తాయి.

తీరప్రాంతేతర అభివృద్ధిపై పనిచేస్తోన్న భిన్న భాగస్వాములకు ఈ వేదిక గణనీయమైన ప్రయోజనాలను అందిస్తోంది. ఇది ప్రణాళిక దశలోనే తీరప్రాంతాల మౌలిక సదుపాయాల విషయంలో సంఘర్షణ, నియంత్రణ సవాళ్లను తెలుసుకోవటాన్ని మెరుగుపరుస్తుంది. తద్వారా ప్రాజెక్ట్ జాప్యాలు, నష్టాలను తగ్గిస్తుంది. ఇది ఆఫ్‌షోర్ ప్రాంత నిర్వహణ, వనరుల కేటాయింపుకు సమగ్రమైన, డేటా-ఆధారిత విధానాన్ని అవలంబించేందుకు అనుమతించటంతో పాటు పర్యావరణ ప్రభావ అంచనా, అనుమతుల ప్రక్రియను క్రమబద్ధీకరిస్తుంది. ధ్రువీకరించిన ప్రభుత్వ విభాగాల నుంచి వచ్చిన ప్రామాణికమైన భౌగోళిక ప్రాదేశిక డేటా కేంద్రీకృత సమాచార కేంద్రంగా పనిచేస్తుంది.

సముద్రాలపై విద్యుత్ ప్రసార మార్గాలను ఉదాహరణగా తీసుకుంటే.. ప్రణాళిక సమయంలోనే ఈ వేదిక విద్యుత్ మంత్రిత్వ శాఖ, పెట్రోలియం- సహజ వాయువు మంత్రిత్వ శాఖ, పర్యావరణం- అటవీ- వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ, టెలికమ్యూనికేషన్ల శాఖతో సహా బహుళ మంత్రిత్వ శాఖల నుంచి సమాచారాన్ని ఏకీకృతం చేసి అందిస్తుంది. భారత ప్రధాన భూభాగాన్ని అండమాన్ నికోబార్ దీవులతో అనుసంధానించే ప్రతిపాదిత హై వోల్టేజ్ డైరెక్ట్ కరెంట్ (హెచ్‌వీడీసీ) సముద్రాంతర లింక్ విషయంలో తక్కువ ఖర్చుతో కేబుళ్లను వేసేందుకు సరిపోయే సముద్రగర్భ లోతులను గుర్తించడానికి బాతిమెట్రీ డేటాను విశ్లేషించవచ్చు. దీనితో పాటు పగడపు దిబ్బలు, మడ అడవులు, తాబేలు గూడు కట్టే ప్రాంతాలు తదితర వంటి సున్నితమైన ప్రాంతాలను తాకకుండా ఉండేందుకు కూడా ఇది సహాయపడుతుంది. హైడ్రోకార్బన్ అన్వేషణ బ్లాక్‌లు, ఆప్టికల్ ఫైబర్ మార్గాలు, సముద్ర ట్రాఫిక్ కారిడార్‌ల డేటా.. సాంకేతికంగా సాధ్యమయ్యే పర్యావరణ అనుకూల అమరికలను ఎంచుకునే విషయంలో మార్గనిర్దేశం చేస్తుంది.

బహుళ స్థాయి విశ్లేషణ, చిత్రీకరణను అందించటం ద్వారా పీఎం గతిశక్తి - ఆఫ్‌షోర్.. జాతీయ తీరప్రాంతేతర ప్రణాళికలో ఖచ్చితత్వం, పారదర్శకత, స్థిరత్వం ఉండేలా చూసుకుంటుంది. వ్యూహాత్మక మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం భౌగోళిక ప్రాదేశిక నిఘాను పెంచటం, నీలి ఆర్థిక వ్యవస్థ సమతుల్య వృద్ధిని ప్రోత్సహించడం, 2047 నాటికి వికసిత్ భారత్ జాతీయ దార్శనికతను ముందుకు తీసుకెళ్లే విషయంలో పెరుగుతోన్న భారతదేశ సామర్థ్యానికి ఈ వేదిక నిదర్శనంగా పనిచేస్తుంది.

# కోదాడ ఇండోర్ స్టేడియంలో అత్యాధునిక లైటింగ్ సిస్టం

నల్గొండ, అక్టోబర్ 14: క్రీడల్లో రాణించి కోదాడ ప్రాంతానికి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకు రావాలని ఎల్డర్స్ రిక్రియేషన్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ ఏటుకూరి రామారావు, పట్టణ ప్రముఖ వైద్యుడు డాక్టర్ జాస్తి సుబ్బారావు అన్నారు. మంగళవారం కోదాడ పట్టణంలో గల ఎల్డర్స్ రిక్రియేషన్ సొసైటీ ఇండోర్ స్టేడియంలో షటిల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుల కోసం ఆధునిక టెక్నాలజీతో సొసైటీ నిధులు రూ. 3.50 లక్షలతో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ ను వారు ప్రారంభించి మాట్లాడారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడా లేనివిధంగా కోదాడలో తాము దాతల సహకారంతో ఇండోర్ స్టేడియం నిర్మాణం చేసేందుకు ఎంతగానో కృషి చేశామని, క్రీడాకారులు స్టేడియంలో శిక్షణ పొంది జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి కోదాడ ప్రాంతానికి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు ఆవుల రామారావు, రామినేని శ్రీనివాసరావు, కోశాధికారి తోట రంగారావు, బీసీ మెంబర్స్ సురేష్ రెడ్డి, శ్రీధర్, క్రీడాకారులు పాల్గొన్నారు.

# కుట్టు శిక్షణపై పరీక్ష నిర్వహించి సర్టిఫికెట్స్ అందిస్తాం : జిల్లా వయోజన విద్యాధికారి



ఆదిలాబాద్, అక్టోబర్ 14:కుట్టు శిక్షణ తీసుకుంటున్న మహిళలకు పరీక్ష నిర్వహించి, ఉత్తీర్ణత సాధించిన వారికి సర్టిఫికెట్లు అందిస్తామని మంచిర్యాల వయోజన విద్యాశాఖ అధికారి పురుషోత్తం నాయక్ పేర్కొన్నారు. మంగళవారం కాసిపేట మండల మండల పరిషత్ కార్యాలయంలో అక్షరాస్యత, కుట్టు మిషన్‌పై శిక్షణ ఇస్తున్న బోధకులతో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంద రోజుల్లో వంద శాతం అక్షరాస్యత సాధించేందుకు కృషి చేసినందుకు అభినందించారు. మండలంలో 22 గ్రామ పంచాయతీల్లో దాదాపు 500 మందికి పైగా మహిళలకు బోధకులచే కుట్టు మిషన్ పై శిక్షణ ఇచ్చినట్లు వివరించారు.

మధ్యలోనే చదువు మానేసిన వారు ఎవరైనా ఉంటే తెలంగాణ ఓపెన్ స్కూల్ ద్వారా టెన్త్, ఇంటర్ అడ్మిషన్ పొందేందుకు ఈనెల 23వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం రాజ్ కుమార్, జాబ్స్ ఏపీఎం రాంచందర్, వయోజన విద్యాశాఖ సిబ్బంది సుమన్, సీసీ అశోక్ కుమార్ పాల్గొన్నారు.

# పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం : సీడీపీఓ తూముల నిర్మల




నల్గొండ, అక్టోబర్ 14:గర్భిణులు, బాలింతలతో పాటుగా అయిదేళ్ల లోపు చిన్నారులు పోషకాహారం తీసుకోవడం ద్వారానే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని నల్లగొండ సీడీపీఓ తూముల నిర్మల అన్నారు. మంగళవారం నల్లగొండ పట్టణంలోని బోయవాడ ప్రభుత్వ పాఠశాల, మాన్యంచెల్కలోని ఉర్దు మీడియా బాలికల పాఠశాలలో పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మానవ జీవన పరిణామ క్రమంలో ఆహారం పట్ల సమతుల్యత పాటించడంపై ఎవరికి తగిన అవగాహన లేకపోవడం వల్ల గర్భిణులు, బాలింతలు, చిన్నారులు అనారోగ్యాల బారిన పడుతున్నారన్నారు.

గర్భిణీలు నాణ్యమైన పౌష్టికాహారం తీసుకోవడం వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరగడంతో పాటు రక్తహీనత, శక్తి, మాంసకృతుల లోపం, అయోడిన్, విటమిన్ ఏ, బీ లోపాలకు గురి కాకుండా ఉంటారాన్నారు. పౌష్టికాహారం లోపం వల్ల బరువు తక్కువగా ఉండటం, బలహీనంగా ఉండటం వంటి సమస్యలతో పాటు శ్వాస తీసుకోవడం, గుండె కదలికలు, బుద్ధి మాంద్యం, మృత జననాలు, పిల్లల మరణాలు, పురిటి మరణాలు సంభవిస్తాయన్నారు. అంతకుముందు రక్త హీనతపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు జయమ్మ, సరస్వతి, అంగన్‌వాడీ టీచర్లు గుత్తా జ్యోతి, కవిత, ప్రేమలత, స్వరూపా, అయేషా ఉమేరా, రాజేశ్వరి, భారతి, లక్ష్మమ్మ, పద్మావతి. రమాదేవి, గర్భినీలు, బాలింతలు పాల్గొన్నారు.

# డిగ్రీ సెమిస్టర్ ఫీజు తగ్గించాలని కేయూలో నిరసన

హనుమకొండ, అక్టోబర్ 14: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, అదిలాబాద్ జిల్లాలలో చదువుతున్న డిగ్రీ మొదటి సంవత్సరం విద్యార్థులకు పెంచిన మొదటి సెమిస్టర్ ఫీజులను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు కేయూలో ఆందోళన చేపట్టారు. కేయూ పరిపాలన భవనం ఎదుట బైఠాయించి అధికారులకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. యూనివర్సిటీ ఇచ్చిన ఫీజు పట్టికను అనుసరించకుండా అధిక ఫీజులు తీసుకుంటున్న ప్రైవేటు డిగ్రీ కాలేజీపై చర్యలు తీసుకోవాలని డెమోక్రటిక్ స్టూడెంట్స్-అసోసియేషన్(డీఎస్ఏ) డీఎస్ఏ జిల్లా కన్వీనర్ ఉప్పుల శివ డిమాండ్ చేశారు.

కాకతీయ యూనివర్సిటీ విడుదల చేసిన మొదటి సెమిస్టర్ ఫీజు ప్రకటనలో భారీగా మార్పులు జరిగాయని విద్యార్థుల తల్లిదండ్రులు పేద మధ్యతరగతి కుటుంబాలని వారు పొద్దున లేస్తే ఎర్రని ఎండలో పనిచేస్తూ వాళ్ల పిల్లలు బాగా చదువుకోవాలని ఆశతో డిగ్రీలు చదివిస్తుంటే యూనివర్సిటీ అధికారులు మాత్రం ఏమాత్రం కనికరం లేకుండా భారీగా ఫీజులు పెంచుతుంటే పేద కుటుంబాల విద్యార్థులు ఎలా చదువుకోవాలని ప్రశ్నించారు.

ఇంతకుముందు ఉన్న రిజిస్ట్రేషన్ ఫీజు రూ. 80 ఇప్పుడు ఏకంగా రూ.1200 పెంచడం సిగ్గుచేటని, వివిధ రకాల పేర్లతో మొత్తం ఫీజు విద్యార్థులు కట్టాల్సింది రూ.1340 కానీ ఇప్పుడు రూ.3250 పెంచడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. వెంటనే పెంచిన ఫీజులు మొత్తం తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డెమోక్రటిక్ స్టూడెంట్స్ అసోసియేషన్ జిల్లా నాయకులు సంజయ్, జాషువా రాజ్‌కుమార్, శశిధర్, శ్రీధర్, డిగ్రీ విద్యార్థులు పాల్గొన్నారు.

# ధరల పతనంతో ఆందోళనలో నిమ్మ రైతులు.. పట్టించుకోని ప్రభుత్వం




నల్గొండ, అక్టోబర్ 14: నిమ్మకాయల ధరలు పాతాళంలోకి పడిపోవడంతో నిమ్మ రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. నిమ్మ సాగులో రాష్ట్రంలోనే పేరున్న ఉమ్మడి నల్లగొండ జిల్లా రైతులు పడిపోయిన ధరతో ఆందోళన చెందుతున్నారు. వేల రూపాయలు పురుగు మందులకు ఖర్చుచేసిన అన్నదాతల పరిస్థితి దయనీయం. ధరలు పడిపోవడంతో నష్టాలు తప్పేలా లేవంటూ అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. నిమ్మ ధరలు నిలకడ లేకుండా రోజుకో ధర పలుకుతోంది. ఇటీవల ధర పూర్తిగా పడిపోవడంతో రైతులకు సమస్యలు వచ్చిపడ్డాయి. ప్రస్తుతం ఒక బస్తా పండు కాయలు రూ.70 నుంచి 100, పచ్చి కాయలు రూ.100 నుంచి 200 లకు మించి పలకడం లేదు. కోత కూలీలు, ఆటో కిరాయిలు కూడా రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది మొదటి నుంచి నిమ్మకు ధర లేకపోవడంతో రైతులు నష్టాల్లో కూరుకుపోయారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి నిమ్మకాయలు అధికంగా ఢిల్లీ, బెంగుళూరు, ఒడిశా, చత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు ఎగుమతి చేస్తుంటారు. ప్రభుత్వం నిమ్మ రైతుల గురించి పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**నకిరేకల్ నియోజకవర్గంలో 5,271 ఎకరాల్లో నిమ్మ సాగు**

నకిరేకల్ నియోజకవర్గం నిమ్మ సాగులో జిల్లాలోనే మొదటి స్థానంలో ఉంది. నకిరేకల్ నియోజకవర్గంలో చిట్యాల, కట్టంగూర్, నార్కట్‌పల్లి, నకిరేకల్, కేతేపల్లి మండలాలతో పాటు తుంగతుర్తి నియోజకవర్గంలోని శాలిగౌరారం మండలంలో సుమారు 2 వేల మంది రైతులు 5,271 ఎకరాలకు పైగా నిమ్మ సాగు చేస్తున్నారు. నకిరేకల్‌లో ఏర్పాటు చేసిన నిమ్మ మార్కెట్‌కు నియోజకవర్గంలోని పలు గ్రామాల రైతులు ప్రతి రోజూ ఆటోలు, మినీ లారీల్లో నిమ్మకాయలు తీసుకెళ్తున్నారు.

రోజు రోజుకు తగ్గుతున్న ధర బస్తా (25 కిలోలు) నిమ్మకాయలు మార్కెట్‌కు తరలించడానికి రూ.వంద ఖర్చవుతుండగా ధర మాత్రం రూ.200 మించి రావడం లేదు. గతేడాది ఇదే సమయంలో బస్తా ధర రూ.1,200 నుండి రూ.2 వేల వరకు ఒకనొక సమయంలో రూ.2,700 వరకు పలికింది. గత రెండు నెలల నుంచి క్రమంగా నిమ్మ ధరలు పడిపోతున్నాయని రైతులు తెలిపారు. రైతులు ఎకరాకు సాగు కోసం రూ.1.20 లక్షలు ఖర్చు చేశారు. పంట దిగుబడి బాగుందని, ఈ ఏడాది మంచి ఆదాయం వస్తుందని భావించిన రైతులకు ధరలు దమాల్ అనడంతో నిరాశే మిగిలింది. గతేడాది రూ.80 ఉన్న ధర ప్రస్తుతం రూ.10కి పడిపోయింది.

**చేతి ఖర్చులు కూడా రావడం లేదు : అంతటి రాము, కట్టంగూర్**

నిమ్మ తోటల వల్ల సంపాదించిందేమీ లేదు. కనీసం పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. గతేడాది ఇదే సమయంలో కిలో వంద రూపాయలు పలికిన ధర ఇప్పుడు రూ.10 రూపాయల కన్నా తక్కువ పలుకుతుంది. ఖాళీ బస్తాకు రూ.10, ఆటో కిరాయి బస్తాకు రూ.20 నుంచి 30, కమిషన్ రూ.15 పోను మాకు చేతి ఖర్చులు కూడా రావడం లేదు. ఇంత భారీ ఎత్తున ధరలు పడిపోవడం ఇదే మొదటి సారి చూస్తున్నాం. ప్రభుత్వం స్పందించి నిమ్మకు గిట్టుబాటు ధర కల్పించాలి.

# వికసిత, సమృద్ధ భారత్ సాధన మన ప్రతిభావంతులైన పాఠశాల విద్యార్థుల భుజస్కంధాలపైనే ఉంది: శ్రీ ధర్మేంద్ర ప్రధాన్

న్యూఢిల్లీ, అక్టోబర్ 14:వికసిత్ భారత్ బిల్డథాన్ (వీబీబీ) 2025ను కేంద్ర విద్యాశాఖ మంత్రి శ్రీ ధర్మేంద్ర ప్రధాన్ ఈ రోజు న్యూఢిల్లీలో ప్రారంభించారు.

దేశవ్యాప్తంగా మూడు లక్షలకు పైగా పాఠశాలలు ఒకేసారి పాల్గొన్న ఈ "వికసిత్ భారత్ బిల్డథాన్ 2025" పాఠశాల విద్యార్థుల కోసం నిర్వహించిన భారతదేశంలోని అతి పెద్ద సమన్వయ ఆవిష్కరణ హ్యాకథాన్‌గా నిలిచింది.

ప్రారంభ కార్యక్రమం సందర్భంగా మంత్రి ఒడిశా లోని భువనేశ్వర్‌లో ఖోర్ధా పీఎంశ్రీ ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులతో సంభాషించారు.

ఈ సందర్భంగా శ్రీ ప్రధాన్ మాట్లాడుతూ... ఈ భారీ పాఠశాల స్థాయి ఆవిష్కరణల కార్యక్రమంలో దేశవ్యాప్తంగా ఉత్సాహంగా పాల్గొన్న మూడు లక్షలకుపైగా పాఠశాలలు, విద్యార్థులను అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు.

ఇక్కడి నుంచి పుట్టుకొచ్చే సృజనాత్మక ఆలోచనలు కొత్త ప్రపంచ నమూనాల సృష్టికి దారితీస్తాయని, దేశీయ, ప్రపంచవ్యాప్త ప్రధాన సవాళ్లకు పరిష్కారాలను కనుగొనడంలో సహాయపడతాయని శ్రీ ప్రధాన్ విశ్వాసం వ్యక్తం చేశారు. వికసిత, సమృద్ధ భారత్ సాధన మన ప్రతిభావంతులైన పాఠశాల విద్యార్థుల భుజస్కధాలపైనే ఉందని మంత్రి పేర్కొన్నారు. వికసిత్ భారత్ బిల్డథాన్ (వీబీబీ ) వంటి మార్పుదాయక ప్రయత్నాల ద్వారానే భారత్ 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా ఆవిర్భవించాలనే ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనికత సాకారం అవుతుందని కేంద్ర మంత్రి పేర్కొన్నారు.

దేశ భవిష్యత్తు నిర్మాణంలో విద్యార్థులు చురుకైన పాత్ర పోషించాలని ఆయన పిలుపునిచ్చారు.

విద్యా మంత్రిత్వశాఖకు చెందిన పాఠశాల విద్య, అక్షరాస్యత విభాగం కార్యదర్శి శ్రీ సంజయ్ కుమార్ మాట్లాడుతూ, ఈ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా విద్యార్థుల భాగస్వామ్యాన్ని, కృషిని ప్రశంసించారు.

ఈ విభిన్నమైన కార్యక్రమం విద్యార్థుల అభ్యాస సామర్థ్యాలను పెంపొందించి, వారి సృజనాత్మక దృక్పథాన్ని మరింత బలపరుస్తుందని అన్నారు.

ఈ కార్యక్రమానికి మార్గనిర్దేశం చేసి మద్దతు అందించిన కేంద్ర విద్యామంత్రి శ్రీ ధర్మేంద్ర ప్రధాన్‌కు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

అటల్ ఇన్నోవేషన్ మిషన్ మిషన్ డైరెక్టర్ శ్రీ దీపక్ బగ్లా మాట్లాడుతూ, వికసిత్ భారత్ బిల్డథాన్ ప్రాముఖ్యతను వివరించారు. ఈ బిల్డథాన్ ఆవిష్కరణల ప్రక్రియను సామూహిక ఉద్యమంగా మార్చి, మారుమూల గ్రామాల్లోని పాఠశాలలను మహానగరాల్లోని పాఠశాలలతో అనుసంధానిస్తుందని తెలిపారు.

విద్యార్థులు, ఉపాధ్యాయులతో సంభాషించేందుకు ఢిల్లీ మాతురా రోడ్‌లోని డెల్హీ పబ్లిక్ స్కూల్, ఢిల్లీ కంటోన్మెంట్ లోని పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయ నెం. 2 ను కూడా శ్రీ ప్రధాన్ సందర్శించారు.

విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సృజనాత్మక ప్రాజెక్టులను శ్రీ ప్రధాన్ పరిశీలించి, వారి అభ్యసన ప్రక్రియల గురించి తెలుసుకున్నారు.

వారి సృజనాత్మకతను, ఉత్సాహాన్ని ప్రశంసిస్తూ, నిరంతరం జిజ్ఞాసువులుగా ఉండాలని ఉద్బోధించారు.

ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యసాధనకు దోహదపడగల వారి అసాధారణ సృజనాత్మకతను అభినందించారు.

ప్రారంభోత్సవ కార్యక్రమం అనంతరం 120 నిమిషాల ఆవిష్కరణల ప్రత్యక్ష పోటీ జరిగింది. రెండు గంటల పాటు జరిగిన ఈ లైవ్ టింకరింగ్ సెషన్‌లో కోటి మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు, ఇందులో 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులు 3-5 మంది చొప్పున జట్లుగా ఏర్పడి ఆత్మనిర్భర్ భారత్, స్వదేశీ, వోకల్ ఫర్ లోకల్, సమృద్ధి అనే నాలుగు ఇతివృత్తాలపై ప్రోటోటైప్‌లను రూపొందించారు.

ఈ కార్యక్రమంలో స్కూల్ స్పాట్‌లైట్స్ ఒక ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది, దీనిలో మారుమూల ప్రాంతాలు, ఆకాంక్ష జిల్లాలు, కొండ రాష్ట్రాలు, సరిహద్దు ప్రాంతాల నుంచి 150కి పైగా పాఠశాలలు నేరుగా అనుసంధానమై తమ పురోగతిని, అనుభవాలను పంచుకున్నాయి.

# 'పీఎం గతిశక్తి పబ్లిక్' వేదికను ప్రారంభించిన వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖా మంత్రి శ్రీ పీయూష్ గోయల్

న్యూఢిల్లీ, అక్టోబర్ 14:ప్రధానమంత్రి గతిశక్తి జాతీయ మాస్టర్ ప్లాన్ నాలుగు సంవత్సరాల విజయవంతమైన ప్రయాణాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా.. వాణిజ్యం, పరిశ్రమల మంత్రిత్వ శాఖకు చెందిన పరిశ్రమ, అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక విభాగం(డీపీఐఐటీ) లాజిస్టిక్స్ విభాగం నేడు న్యూఢిల్లీలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించింది. దీనికి కేంద్ర వాణిజ్యం, పరిశ్రమల మంత్రి శ్రీ పీయూష్ గోయల్ అధ్యక్షత వహించారు. గత నాలుగేళ్లలో పీఎం గతిశక్తి ద్వారా దేశంలోని మౌలిక సదుపాయాల ప్రణాళిక, అమలు, సమన్వయంలో జరిగిన కీలకమైన మార్పులను ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు.

ఈ కార్యక్రమాల్లో యూనిఫైడ్ జియోస్పేషియల్ ఇంటర్‌ఫేస్ (యూజీఐ) ద్వారా "పీఎం గతిశక్తి పబ్లిక్' వెబ్‌సైట్ ప్రారంభం కీలక మైలురాయిగా నిలిచింది. ఇది భౌగోళిక, మౌలిక సదుపాయాల సమాచారాన్ని ప్రజాస్వామ్యీకరణలో భాగంగా ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు దోహదపడుతుంది. పీఎం గతిశక్తి ఎన్ఎంపీ వేదిక ద్వారా సున్నితంకాని సమాచారం ప్రజలకు చేరువ కానుంది. దీనివల్ల ప్రైవేట్ సంస్థలు, కన్సల్టెంట్లు, పరిశోధకులు, పౌరులు మౌలిక సదుపాయాల ప్రణాళిక, పెట్టుబడి నిర్ణయాలు తీసుకోవడంలో ఆధునిక విశ్లేషణా సాధనాలను వినియోగించుకోవచ్చు. పీఎం గతిశక్తి జాతీయ మాస్టర్ ప్రణాళిక కోసం భాస్కరాచార్య నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ స్పేస్ అప్లికేషన్స్ అండ్ జియో-ఇన్ఫర్మాటిక్స్ అభివృద్ధి చేసిన ఈ జియోస్పేషియల్ వేదిక.. నేషనల్ జియోస్పేషియల్ డేటా రిజిస్ట్రీ ఆధారంగా పనిచేస్తుంది. ఈ వేదిక వినియోగదారులకు భౌతిక, సామాజిక మౌలిక సదుపాయాల సమాచారం గురించి 230 ఆమోదించిన డేటాసెట్‌లు, సైట్ అనుకూలత విశ్లేషణలు, కనెక్టివిటీ మ్యాపింగ్, అలైన్‌మెంట్ ప్లానింగ్. సమ్మతి తనిఖీలను నిర్వహించడానికి అనుమతిస్తుంది. అలాగే ముందుగా నిర్వచించిన టెంప్లేట్లు, వినియోగదారు నిర్వచించిన ప్రమాణాల ఆధారంగా విశ్లేషణాత్మక నివేదికలను రూపొందించడానికి కూడా అనుమతిస్తుంది. వినియోగదారులు బహుళ లేయర్ల భౌగోళిక సమాచారాన్ని చూడవచ్చు. మెరుగైన ప్రాజెక్టు డిజైన్, ఏజెన్సీల మధ్య సమన్వయం, ప్రైవేట్ రంగ భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తుంది.

స్వీయ నమోదు ద్వారా పీఎం గతిశక్తి వేదికను ఉపయోగించాలి. ఇందుకు బలమైన ధృవీకరణ, డేటా భద్రతా ప్రమాణాలు అవసరం. ఇది భద్రతా ప్రమాణాలు, విధాన నిబంధనలకు అనుగుణంగా వినియోగదారుల గోప్యతను కాపాడుతుంది. వినియోగదారుల అభిప్రాయాలు, పెరుగుతున్న అవసరాల ఆధారంగా కొత్త డేటా లేయర్లు, అధునాతన విశ్లేషణా సాధనాలతో భవిష్యత్తులో తదుపరి దశల్లో మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంది.

2021 అక్టోబర్ 13న ప్రారంభించిన పీఎం గతిశక్తి.. 57 కి పైగా కేంద్ర మంత్రిత్వ శాఖలు, విభాగాలు, రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల నుంచి భౌగోళిక సమాచారాన్ని ఒకే వేదికపై అందించడం ద్వారా దేశంలో మౌలిక సదుపాయాల ప్రణాళిక, అమలులో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది. ఇది ప్రాజెక్ట్ ప్రణాళికలో సమన్వయం, వేగవంతమైన అమలు, మరియు రవాణా ఖర్చుల తగ్గింపునకు దోహదపడింది. దీని ద్వారా సేవల నాణ్యత పెంపు, ప్రాజెక్ట్ అమలులో వేగం, పారదర్శకత, ఆర్థిక వృద్ధికి తోడ్పాటు, దేశంలో ప్రపంచ పోటీతత్వాన్ని పెంచింది .గత నాలుగు సంవత్సరాల్లో పీఎం గతిశక్తి వందలాది ప్రధాన మౌలిక ప్రాజెక్టులను చేపట్టింది. అన్ని కేంద్ర మంత్రిత్వ శాఖలు, విభాగాలు, రాష్ట్ర ప్రభుత్వాలను అనుసంధానించింది. ప్రణాళిక, విశ్లేషణ కోసం కృత్రిమ మేధ వంటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాలను వినియోగించింది. ఈ కార్యక్రమం దేశ మౌలిక సదుపాయాల అభివృద్ధి రంగంలో ఒక మూలాధారంగా ముందుకు సాగుతూనే ఉంది.

పీఎం గతిశక్తి ఆధునిక డేటా విశ్లేషణ సామర్థ్యాలను ప్రైవేటు రంగానికి, ప్రజలకు విస్తరించడం ద్వారా ఈ పథకం ఆత్మనిర్భర్ భారత్ దార్శనికతకు అనుగుణంగా..పారదర్శకత, సమగ్ర ప్రణాళిక, ఆవిష్కరణలకు నిబద్ధతను బలోపేతం చేస్తుంది. మౌలిక సదుపాయాల ప్రణాళిక, అమలు విషయంలో మంత్రిత్వ శాఖలు, పరిశ్రమలు, పౌరుల మధ్య సహకారాన్ని ప్రోత్సహించడం ద్వారా 'ప్రభుత్వ సమగ్రత' 'సమాజ సమగ్రత' దృక్పథాన్ని ప్రతిబింబిస్తుంది.

# రూ.2.96 కోట్లతో ఖమ్మం ప్రభుత్వ కళాశాలలకు మరమ్మతులు : డీఐఈఓ రవిబాబు

ఖమ్మం, అక్టోబర్ 14:ఖమ్మం జిల్లాలోని 15 ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రూ.2.96 కోట్ల వ్యయంతో చిన్న, మధ్య తరహా మరమ్మతు పనులను చేపడుతున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి (డీఐఈఓ) కె.రవిబాబు తెలిపారు. ఖమ్మం జిల్లా వైరా నియోజకవర్గ పరిధిలోని సింగరేణి (కారేపల్లి) మండల కేంద్రంలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎఫ్ఆర్ఎస్ (ఫేస్ రికగ్నైజ్డ్ సైన్) ద్వారా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల హాజరు శాతం గతం కంటే పెరిగిందన్నారు. అదేవిధంగా హెచ్ఆర్ఎంఎస్, సీసీ కెమెరాలను అమర్చడం ద్వారా కళాశాల సిబ్బంది విధి నిర్వహణ పనితీరును రాష్ట్ర ఇంటర్మీడియట్ విద్యాశాఖ సంచాలకులు కంట్రోల్ రూమ్ లో పర్యవేక్షించడం జరుగుతుందన్నారు.

ప్రతి కళాశాలలో సైన్స్ గ్రూప్ విద్యార్థులకు ఎంసెట్ కోచింగ్ ఇస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా ఖాన్ అకాడమీ ద్వారా ఇంటర్మీడియట్ పూర్తి చేసిన తర్వాత విద్యార్థులు పై చదువులను ఏ విధంగా ఎంచుకుంటే ఏం ప్రయోజనం చేకూరుతుందనే అంశంపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ప్రతి శనివారం క్రీడలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తూ విద్యార్థులకు చదువుతో పాటు అదనపు యాక్టివిటీస్ ను ప్రోత్సహిస్తున్నట్లు వివరించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా కళాశాల భవనాల్లో నెలకొన్న వివిధ రకాల మరమ్మతు పనులను చేపడుతున్నట్లు వెల్లడించారు. అంతకుముందు కళాశాలలో జరుగుతున్న మరమ్మతు పనులను డీఐఈఓ పరిశీలించారు. ఆయన వెంట కళాశాల ప్రిన్సిపాల్ విజయ కుమారి, అధ్యాపక సిబ్బంది ఉన్నారు.

# ఉత్తమ పద్ధతులు, విజయవంతమైన ఘట్టాలను ప్రధానంగా తెలియజేసే పీఎం గతిశక్తి సంకలనం 3వ సంపుటిని విడుదల చేసిన కేంద్ర మంత్రి

న్యూఢిల్లీ, అక్టోబర్ 14:ప్రధాన మంత్రి గతిశక్తి జాతీయ మాస్టర్ ప్లాన్‌కు (ఎన్ఎంపీ) నాలుగు సంవత్సరాల నిండిన సందర్భంగా ఢిల్లీలో ఇవాళ నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర వాణిజ్యం, పరిశ్రమల మంత్రి శ్రీ పీయూష్ గోయల్.. ఈ ప్రణాళిక తీసుకొచ్చిన భారీ మార్పును ప్రత్యేకంగా పేర్కొన్నారు. నాలుగు ఏళ్ల క్రితం ఇదే రోజున ఎన్ఎంపీ ప్రారంభమైంది.

ప్రధానమంత్రి గతిశక్తి వేగం, సామర్థ్యాన్ని.. రెండింటినీ తీసుకొస్తుందన్న పీయూష్ గోయల్.. ఇది సాధారణ కార్యక్రమం కాదని పేర్కొన్నారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనికత నుంచి ఇది వచ్చిందని తెలిపారు. ప్రజలకు ఉపయోగపడే మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను ప్రణాళికతో మెరుగైన రీతిలో చేపట్టే విధానంపై దాదాపు రెండు దశాబ్దాల సుదీర్ఘ ఆలోచన దీని వెనుక ఉందని అన్నారు. ప్రభుత్వాధినేత శ్రీ నరేంద్ర మోదీ వరిపాలనలో వినూత్న ఆలోచనలను తీసుకొచ్చారని తెలిపారు. ఆయన భారత్‌ను సుసంపన్న అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలనే స్పష్టమైన లక్ష్యాన్ని కలిగి ఉన్నారని కేంద్ర మంత్రి అన్నారు. 2047 నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చేందుకు భాగస్వాములందరూ కలిసికట్టుగా అంకితభావంతో ఉన్నారని.. ఈ ప్రయాణంలో ప్రధానమంత్రి గతిశక్తి కీలక పాత్ర పోషిస్తుందని శ్రీ పీయూష్ గోయల్ చెప్పారు.

భారతదేశ మౌలిక సదుపాయాల విషయంలో ప్రణాళిక, సంబంధిత వ్యవస్థ అభివృద్ధిని మరింత బలోపేతం చేసేందుకు ఉద్దేశించిన పలు కీలక కార్యక్రమాలను శ్రీ పీయూష్ గోయల్ ప్రారంభించారు. పీఎం గతిశక్తి జాతీయ మాస్టర్ ప్లాన్ (ఎన్ఎంపీ) వేదికను అవసరం మేరకు విశ్లేషించే విధానంలో ప్రైవేట్ రంగానికి అందిస్తున్నారు. ఈ విశ్లేషణ పద్ధతిని భాస్కరాచార్య నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ స్పేస్ అప్లికేషన్స్ అండ్ జియో-ఇన్ఫర్మేటిక్స్ (బీఐఎస్ఏజీ-ఎన్) అభివృద్ధి చేసింది. ఇది భౌగోళిక ప్రాదేశిక డేటా, అధునాతన విశ్లేషణలకు వీలు కల్పిస్తుంది. విజయవంతమైన ఘట్టాలు, ఉత్తమ పద్ధతులను తెలిపే పీఎం గతిశక్తి సంకలనం 3వ సంపుటిని ఆయన విడుదల చేశారు. పురోగతిని పర్యవేక్షించటం, కార్యాచరణ విషయంలో లోతైన విషయాలను పొందేందుకు సమగ్ర బహుళ రంగాల రిపోర్టింగ్ వ్యవస్థ అయిన పీఎంజీఎస్ ఎన్ఎంపీ డ్యాష్‌బోర్డ్‌ను ప్రారంభించారు. మంత్రిత్వ శాఖలు- విభాగాలు, రాష్ట్రాలు- కేంద్రపాలిత ప్రాంతాలు మధ్య క్రాస్ లెర్నింగ్‌తో పాటు విజ్ఞాన మార్పిడిని ప్రోత్సహించేందుకు ఉద్దేశించిన కేఎంఎస్‌ను (నాలెడ్జ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్) ప్రారంభించారు. బహుళ రంగాలలో తీరప్రాంతేతర అభివృద్ధి, సమగ్ర ప్రణాళిక- నిర్వహణకు సంబంధించిన పీఎం గతిశక్తి- ఆఫ్‌షోర్ అనే ప్రత్యేక డిజిటల్ వేదికను ఆవిష్కరించారు. ప్రత్యక్ష డేటా యాజమాన్యం, జవాబుదారీతనాన్ని మెరుగుపరిచేందుకు ఉద్దేశించిన వికేంద్రీకృత డీయూఎంఎస్‌ను (డేటా అప్‌లోడింగ్- మేనేజ్‌మెంట్ సిస్టమ్) ఆయన ప్రారంభించారు. డేటా ఆధారిత స్థానిక మౌలిక సదుపాయాల అభివృద్ధి, సమగ్ర ప్రాంతీయ వృద్ధిని బలోపేతం చేసేందుకు ఆకాంక్షిత జిల్లాలకు సంబంధించిన పీఎంజీఎస్ జిల్లా మాస్టర్ ప్లాన్ (డీఎంపీ)ను ప్రారంభించారు. రవాణా రంగంలో ఉత్తమ నాయకత్వం, ఆవిష్కరణలను గుర్తించేందుకు ఉద్దేశించిన లీప్స్-2025ను (లాజిస్టిక్స్ ఎక్సలెన్స్, అడ్వాన్స్‌మెంట్- పెర్ఫార్మెన్స్ షీల్డ్) ఆవిష్కరించారు.

ప్రధానమంత్రి గతిశక్తిని ప్రారంభించినప్పుడు ప్రధానమంత్రి.. ఆత్మనిర్భర్ భారత్ సంకల్పంతో రాబోయే 25 సంవత్సరాల అభివృద్ధికి పునాది పడుతున్నట్లు తెలిపారని పీయూష్ గోయల్ అన్నారు. స్థూల స్థాయి ప్రణాళిక, సూక్ష్మ స్థాయి అమలు మధ్య కీలకమైన వారధిగా మారిన ప్రధానమంత్రి గతిశక్తి.. వివిధ రంగాలు, సంస్థలను మార్చేసే ప్రభావవంతమైన సాధనంగా పనిచేస్తోందని అన్నారు. జాతీయ అభివృద్ధి పథాన్ని మార్చే సామర్థ్యం ఈ కార్యక్రమానికి ఉందన్నారు. ఇది ఇకమీదట రోడ్లు, రైల్వే మార్గాల ప్రణాళికకు మాత్రమే పరిమితం కాదన్న ఆయన.. వీటిని జాతీయ ప్రణాళిక, అమలులో మరింత లోతుగా ఏకీకృతం చేయటాన్ని సులభతరం చేస్తుందని అన్నారు. ఇప్పుడు ఒకే ఇంటిగ్రేటెడ్ డాటాబేస్‌తో మ్యాప్ అయిన 112 ఆంకాక్షిత జిల్లాలకు సంబంధించిన ప్రధానమంత్రి గతిశక్తి జిల్లా మాస్టర్ ప్లాన్‌ను ప్రారంభించటం వల్ల ఈ ప్రాంతాలు సమగ్రంగా అభివృద్ధి చెందుతాయని కేంద్ర మంత్రి శ్రీ పీయూష్ గోయల్ తెలియజేశారు. వృద్ధి చివరి వ్యక్తిని చేరేలా చూసుకోవటం ద్వారా సమ్మిళిత, సుస్థిరాభివృద్ధిని ప్రోత్సహించేలా ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్లు తెలిపారు. ఆరోగ్య సంరక్షణ, విద్య, రవాణా, పారిశ్రామికాభివృద్ధి, పర్యావరణ నిర్వహణ, భద్రత, ఖనిజ వనరుల వినియోగం, పునరుత్పాదక ఇంధనోత్పత్తి వంటి కీలక రంగాలలో ప్రాంతీయ ప్రణాళికకు జిల్లా మాస్టర్ ప్లాన్ మద్దతునిస్తుంది. విడివిడి అభివృద్ధి విధానాల నుంచి ఉమ్మడి విధానాల ద్వారా ప్రాంతాలను అభివృద్ధి చేసే సమగ్ర ప్రణాళికకు మారటాన్ని ఇది తెలియజేస్తోందని అన్నారు.

చివరి మైలు అనుసంధానత మెరుగవటంతో రవాణా ఖర్చులు తగ్గాయని పీయూష్ గోయల్ ప్రముఖంగా ప్రస్తావించారు. గతంలో గనుల నుంచి విద్యుతుత్పత్తి కేంద్రాలకు బొగ్గు రవాణాలో పలు సార్లు లోడింగ్, అన్‌లోడింగ్ చేయాల్సి ఉండటం వల్ల అసమర్థతకు, వ్యయాలు పెరిగేందుకు, నష్టాలకు దారితీసిందని అన్నారు. గనులు, విద్యుతుత్పత్తి కేంద్రంలో చివరి మైలు అనుసంధానతను క్రమబద్ధీకరించడం వల్ల విద్యుత్ ఖర్చు భారీగా తగ్గి మొత్తం రవాణా సామర్థ్యం పెరిగిందని తెలిపారు. గత నాలుగు సంవత్సరాలుగా పలు ప్రాంతాలకు చేరుకున్న పీఎం గతిశక్తి ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న పట్టణ ప్రణాళిక సంస్థలు- వ్యక్తులు, రాష్ట్రాలు, మంత్రిత్వ శాఖలు లబ్ధిపొందాయని అన్నారు.

ఉత్తమ పద్ధతులు, విజయవంతమైన సందర్భాలను తెలియజేసే సంకలనాన్ని (వాల్యూమ్-3) కేంద్ర మంత్రి విడుదల చేశారు. పీఎం గతిశక్తి చేపట్టిన కార్యక్రమాలు, ప్రజల జీవితాలపై చూపించిన స్పష్టమైన ప్రభావాలను ఇది తెలియజేస్తోంది.

ప్రధానమంత్రి గతిశక్తి డేటాబేస్‌లను ప్రజలకు అందుబాటులోకి తెస్తామని గత బడ్జెట్‌లో చేసిన ప్రకటనను మంత్రి ప్రస్తావించారు. యూనిఫైడ్ భౌగోళిక ప్రాదేశిక ఇంటర్‌ఫేస్ ద్వారా పీఎం గతిశక్తి డేటాబేస్‌ను ప్రజలందరూ ఉపయోగించుకునేలా భాస్కరాచార్య నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ స్పేస్ అప్లికేషన్స్ అండ్ జియో-ఇన్ఫర్మేటిక్స్ (బీఐఎస్ ఏజీ-ఎన్), మంత్రిత్వ శాఖ కృషి చేసిందని అన్నారు. ప్రణాళిక తయారుచేయటం, నిర్ణయాలు తీసుకునే విషయంలో డేటాను ఉపయోగించటం, డేటాను సులభంగా పొందేందుకు వీలు కల్పిస్తుందని మంత్రి తెలిపారు.

ప్రస్తుతం అవలంబిస్తోన్న ప్రాంతీయ ప్రణాళిక విధానంలో వివిధ ప్రాంతాల అభివృద్ధిపై పీఎం గతిశక్తి ప్రభావం చూపించే తీరును తెలుసుకునేందుకు సమగ్ర బహుళ-రంగ నివేదిక వ్యవస్థను ప్రారంభించినట్లు కేంద్ర మంత్రి తెలిపారు. వికేంద్రీకృత డేటా షేరింగ్ మాడ్యూల్.. సమాచారాన్ని అందుబాటులో ఉండేలా చూసుకోవటంతో పాటు డేటాబేస్‌లను తాజాగా ఉంచే ప్రాముఖ్యతను తెలియజేస్తోందన్నారు. సరైన డ్యాష్‌బోర్డ్ ప్రణాళికకు ఉపయోగపడటంతో పాటు ప్రజలకు డేటాను అందుబాటులోకి తీసుకొస్తుందన్నారు. తద్వారా పారదర్శకతను పెంచటం, ఆధారాలతో కూడిన నిర్ణయాలు తీసుకోవటాన్ని సులభతరం చేస్తుందని తెలిపారు.

ఆయా ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల లోటును భర్తీ చేస్తూ ప్రాంత-నిర్దిష్ట ప్రణాళికలో భాగంగా స్థానిక అవసరాలను తీర్చడం ద్వారా ఆకాంక్షిత జిల్లాలను చేరుకోవటం అనేది ఈ కార్యక్రమ ముఖ్య లక్ష్యమని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. సమగ్ర అభివృద్ధి, వనరులను అందరికి సమానంగా అందుబాటులో ఉంచే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం.. రెండింటి సమష్టి నిబద్ధతను ఈ కార్యక్రమం తెలియజేస్తోందని మంత్రి అన్నారు.

దేశవ్యాప్తంగా రవాణా సామర్థ్యం, దాని ప్రభావాన్ని మెరుగుపరచడంలో భాగస్వాముల కృషిని గుర్తించేందుకు ఉద్దేశించిన లీప్స్‌ను (లాజిస్టిక్స్ ఎక్సలెన్స్, అడ్వాన్స్‌మెంట్, పెర్ఫార్మెన్స్ షీల్డ్) ప్రారంభించటం మరో కీలక ఘట్టమని శ్రీ పీయూష్ గోయల్ అన్నారు. గత నాలుగు సంవత్సరాల విజయాలు అద్భుతమైనవన్న మంత్రి.. మంత్రిత్వ శాఖలు- విభాగాలు, రాష్ట్రాలు - కేంద్రపాలిత ప్రాంతాలనే పరిధిని దాటేందుకు పీఎం గతిశక్తికి స్పష్టమైన దార్శనికత కలిగి ఉందని పేర్కొన్నారు.

సముద్ర వనరుల మ్యాపింగ్, పవన శక్తి ప్రణాళిక, తీరప్రాంతేతర - భూగర్భ కేబుల్ మార్గాలు, టెలికాం - డేటా నెట్‌వర్క్‌లతో పాటు భవిష్యత్తులో సముద్రగర్భ విద్యుత్ ప్రసారం వంటి విభాగాలకు విస్తరిస్తోన్న దృష్ట్యా.. పీఎం గతి శక్తి పరిధి, స్థాయి, ప్రభావం భారీ మార్పుకు లోనవుతున్నాయని మంత్రి అన్నారు. భౌతిక, సామాజిక మౌలిక సదుపాయాలకు మించి ప్రజలు, పరిశ్రమలు, ప్రణాళికలు తయారుచేసే సంస్థలను అనుసంధానించే వేదికగా ఈ కార్యక్రమాన్ని మార్చేందుకు ప్రభుత్వ పనిచేస్తోందని ఆయన అన్నారు. దీనివల్ల పీఎం గతిశక్తి జాతీయ, మానవ అభివృద్ధికి కేంద్ర సాధనంగా మారటంతో పాటు దేశాన్ని ఉన్నత శిఖరాలకు తీసుకెళుతుందన్నారు. మొత్తంగా వికసిత్ భారత్ 2047 దార్శనికతను సాకారం చేస్తుందని అన్నారు.

ఇప్పుడు ప్రధానమంత్రి గతిశక్తి భౌతిక మౌలిక సదుపాయాలకు మించి సామాజిక మౌలిక సదుపాయాలు, మానవ అభివృద్ధి, పరిశ్రమల భాగస్వామ్యం, డిజిటల్ ఏకీకరణ విషయంలో పనిచేస్తోందని కేంద్ర మంత్రి ప్రముఖంగా ప్రస్తావించారు. ఇది సమగ్ర, సమ్మిళిత, డేటా ఆధారిత వృద్ధిని ప్రోత్సహిస్తూ జాతీయ అభివృద్ధికి కేంద్రంగా మారిందన్నారు. ఇప్పుడు పీఎం గతిశక్తి.. పవన శక్తి, తీరప్రాంతేతర కేబుల్స్, భూగర్భ కేబుల్స్, టెలికాం కేబుల్స్, డేటా ఆప్టికల్ కేబుల్స్ పాటు తీరప్రాంతేతర వనరుల మ్యాపింగ్, అన్వేషణకు వర్తిస్తోందని తెలిపారు. భవిష్యత్తులో సముద్రగర్భంలో విద్యుత్ ప్రసారంపై కూడా పనిచేయనుందని పేర్కొన్నారు. ప్రధానమంత్రి గతిశక్తి పరిధి, వర్తించే అంశాలు భారీ మార్పు లోనవుతున్నాయని.. దీనిని తదుపరి స్థాయికి చేర్చేందుకు ప్రభుత్వం చురుకుగా పనిచేస్తోందని తెలిపారు. ఈ విస్తరణ భౌతిక, సామాజిక మౌలిక సదుపాయాలను ఏకీకృతం చేయడం.. ప్రజలు, పరిశ్రమల భాగస్వామ్యాన్ని పెంచటం.. మానవాభివృద్ధి, దేశ పురోగతికి ప్రధానమంత్రి గతిశక్తిని ఒక వ్యూహాత్మక సాధనంగా మార్చటం, అంతిమంగా వికసిత్ భారత్ 2047 దార్శనికతకు దోహదపడటమే లక్ష్యంగా పెట్టుకుందని మంత్రి తెలిపారు.

భారతదేశం ప్రధాన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను ప్రణాళిక, అమలు చేసే పద్ధతిలో పీఎం గతిశక్తి భారీ మార్పును తీసుకొచ్చిందని పీయూష్ గోయల్ తెలిపారు. పలు మంత్రిత్వ శాఖలు, రాష్ట్రాల నుంచి డేటాను ఒకే చోట అందుబాటులో ఉంచటం ద్వారా ఈ కార్యక్రమం ఫలితాల ఆధారంగా నిర్ణయం తీసుకునే సాధనాన్ని సృష్టించిందని అన్నారు. ఎన్ఎంపీ వేదికను ప్రైవేట్ రంగానికి అందుబాటులోకి తీసుకురావటం, విజ్ఞాన నిర్వహణ వ్యవస్థను ప్రారంభించటం, పీఎం గతిశక్తి- ఆఫ్‌షోర్ ఆవిష్కరణతో సహా ప్రారంభించిన కొత్త కార్యక్రమాలు.. డేటా ఆధారిత ప్రణాళికను మరింత మెరుగుపరుస్తాయని అన్నారు. దీనితో పాటు విభిన్న రంగాల సహకారాన్ని పెంపొందిస్తాయని, దేశవ్యాప్తంగా సమగ్ర - స్థిరమైన అభివృద్ధిని వేగవంతం చేస్తాయని కేంద్ర మంత్రి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రిత్వ శాఖలు- విభాగాలు, రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, పరిశ్రమ సంఘాలకు చెందిన వారు 200 మందికి పైగా పాల్గొన్నారు. కేంద్ర వాణిజ్యం, పరిశ్రమల శాఖ సహాయ మంత్రి శ్రీ జితిన్ ప్రసాద.. మధ్యప్రదేశ్ ప్రజా పనుల మంత్రి శ్రీ రాకేష్ సింగ్ ఈ కార్యక్రమంలో మాట్లాడారు. ప్రధానమంత్రి గతిశక్తి పరిణామాన్ని వారు ప్రధానంగా ప్రస్తావించారు.

నెట్‌వర్క్ ప్లానింగ్ గ్రూప్ (ఎన్‌పీజీ) పీఎం గతిశక్తి ప్రమాణాలను ఉపయోగించి 300కి పైగా ప్రధాన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను సమీక్షించింది. వీటిలో ఇంటిగ్రేటెడ్ ప్లానింగ్, పూర్తిస్థాయి అనుసంధానత, ఇంటర్‌మోడల్ లింకేజీలు, రవాణా సామర్థ్యం పెంపు, సమన్వయంతో ప్రాజెక్టులను చేపట్టటం తదితరాలు ఉన్నాయి.

36 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు జాతీయ మాస్టర్ ప్లాన్‌తో అనుసంధానమైన రాష్ట్ర మాస్టర్ ప్లాన్ (ఎస్ఎంపీ) పోర్టల్‌లను తయారుచేసుకున్నాయి. ఇవి మూలధన పెట్టుబడిని క్రమబద్ధీకరించేందుకు, ప్రాజెక్ట్ అమలును వేగవంతం చేయడానికి ఉపయోగపడతాయి. పీఎం గతిశక్తి పోర్టల్‌లో 600కి పైగా ప్రాజెక్టుల ప్రణాళిక, మ్యాపింగ్ చేసారు.

సామాజిక-ఆర్థిక అభివృద్ధి కోసం పీఎం గతిశక్తిని ఉపయోగించటంపై దృష్టి సారిస్తూ సామాజిక- ఆర్థిక మంత్రిత్వ శాఖలకు ఈ కార్యక్రమం విస్తరించింది. పాఠశాలలు, ఆసుపత్రులు, అంగన్‌వాడీలలో మౌలిక సదుపాయాల లోటును గుర్తించడం సంబంధిత డేటా కోసం ప్రణాళిక సాధనాలను తయారు చేయటం ద్వారా ఈ వేదిక ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ, విద్య, పోస్టల్ సేవలు, గిరిజన అభివృద్ధిలో మరింత ప్రభావవంతమైన ప్రణాళికకు దారితీసింది. మారుమూల, వెనుకబడిన ప్రాంతాలు కూడా దేశంలోని మౌలిక సదుపాయాల వృద్ధి నుంచి ప్రయోజనం పొందేలా పీఎం గతిశక్తి చూసుకుంది.

జాతీయ మాస్టర్ ప్లాన్ ఆధారంగా బీఐఎస్ఏజీ-ఎన్ ఇచ్చిన సాంకేతిక సహకారంతో అభివృద్ధి చేసిన పీఎం గతిశక్తి జిల్లా మాస్టర్ ప్లాన్ (డీఎంపీ) పోర్టల్.. 28 ఆకాంక్షిత జిల్లాల విషయంలో జిల్లా స్థాయి సహకార ప్రణాళికను తయారుచేయటాన్ని సులభతరం చేస్తుంది. విభాగాల మధ్య సహకారం, ఏఐ- ఐఓటీ వంటి వర్ధమాన సాంకేతికలను ఉపయోగించటం ద్వారా ఈ పోర్టల్ సమగ్ర సామాజిక-ఆర్థిక ప్రణాళికను చేపట్టనుంది. అరుణాచల్ ప్రదేశ్ వెస్ట్ కామెంగ్‌లోని బిచోమ్‌లో పర్యాటక ప్రణాళిక, ఒడిశాలోని కళింగనగర్‌లో ఆర్థిక అభివృద్ధి ప్రణాళికతో సహా ఈ వేదికను సమగ్రాభివృద్ధికి వేదికగా ఉపయోగించేందుకు వివిధ భాగస్వాములకు శిక్షణ ఇచ్చాయి.

సామర్థ్యం, నైపుణ్యాలను పెంపొందించేందుకు ఐజీఓటీ కోర్సులు, వర్క్‌షాప్‌లు, ఇంటరాక్టివ్ సెషన్‌ల ద్వారా డీపీఐఐటీ విస్తృత స్థాయిలో శిక్షణ కార్యక్రమాలను చేపట్టింది. వీటికి 20,000 మందికి పైగా అధికారులు హాజరయ్యారు. పీఎం గతిశక్తి మాడ్యూళ్లను కేంద్ర శిక్షణా సంస్థల పాఠ్యాంశాల్లో చేర్చారు. మంత్రిత్వ శాఖలు, ప్రభుత్వ విభాగాలు, రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో దాదాపు 250 ఇంటరాక్టివ్ కార్యక్రమాలను నిర్వహించారు.

సామర్థ్య పెంపుదలకు నిబద్ధతను తెలియజేసేలా డీపీఐఐటీ.. మౌలిక సదుపాయాలు, రవాణా ప్రణాళికలో నైపుణ్య అభివృద్ధి, క్రాస్-లెర్నింగ్, సాంకేతిక సహాయాన్ని పెంపొందించే ఉద్దేశంతో గతిశక్తి విశ్వవిద్యాలయం, కొరియా రవాణా సంస్థతో (కేటీఐ) అవగాహన ఒప్పందం చేసుకుంది.

సమీకృత మౌలిక సదుపాయాల ప్రణాళికలో ప్రధానమంత్రి గతిశక్తి, భౌగోళిక ప్రాదేశిక సాంకేతికతల ఉపయోగాన్ని ప్రోత్సహించేందుకు నేపాల్, బంగ్లాదేశ్, శ్రీలంక, మడగాస్కర్, సెనెగల్, గాంబియా వంటి దేశాలతో అంతర్జాతీయ భాగస్వామ్యం కొనసాగుతోంది.

గత సంవత్సరం ఇదే రోజున ఢిల్లీలోని ఐటీపీఓలో ప్రధానమంత్రి గతిశక్తి అనుభూతి కేంద్రాన్ని (ఎక్స్‌పీరెన్షియల్ సెంటర్) ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రారంభించారు. హోలోగ్రాఫిక్ ప్రదర్శనలు, ఏఆర్-వీఆర్ అనుభవాలు, ఇంటరాక్టివ్ సిమ్యులేషన్లతో ఉన్న ఈ కేంద్రం.. అంతర్జాతీయ ప్రతినిధులు, దౌత్యవేత్తలు, ప్రభుత్వాధికారులు, విద్యార్థులు, సాధారణ ప్రజలను స్వాగతం పలుకుతూ పీఎం గతిశక్తిని ప్రపంచానికి తెలియజేసే, ప్రజలకు అందుబాటులో ఉండే కేంద్రంగా పనిచేసింది.

గత నాలుగు సంవత్సరాలుగా పీఎం గతిశక్తి భారతదేశంలోని మౌలిక సదుపాయాలకు సంబంధించిన ప్రణాళికను.. వినూత్న డిజిటల్ సాధనాలు, సమీకృత వేదికలు, వివిధ రంగాల మధ్య సహకారం అనే అంశాల ద్వారా మార్చేసింది. నిరంతర విస్తరణ, నూతన భాగస్వామ్యాల రాకతో పీఎం గతిశక్తి.. మౌలిక సదుపాయాల విషయంలో భారత్‌కు ఉన్న దార్శనికతను సాధించే దిశగా ప్రయాణాన్ని వేగవంతం చేయటం, ఆర్థిక పురోగతిని ముందుకు తీసుకెళ్లటం, ప్రజల జీవన నాణ్యతను మెరుగుపరిచేందుకు సిద్ధంగా ఉంది. పీఎం గతిశక్తి ప్రాజెక్టులను చేపట్టటం మాత్రమే కాదు.. ఇది భారతదేశ భవిష్యత్తును రూపొందిస్తోంది.

## దేశవ్యాప్తంగా ప్రారంభించిన సీపీఆర్ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న 15,000 మంది ఆరోగ్య రంగం, పౌర సమాజం పౌరులు

న్యూఢిల్లీ, అక్టోబర్ 14:క్లిష్టమైన కార్డియాక్ కేసుల సమయంలో ప్రాణాలను రక్షించే.. జీవించే అవకాశాలను పెంపొందించే అత్యవసర ప్రక్రియే కార్డియోపల్మనరీ రిససిటేషన్ (సీపీఆర్). దీనిపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఈ రోజు సీపీఆర్ అవగాహన వారోత్సవాలను (2025 అక్టోబర్13-17) ప్రారంభించింది. కార్డియోపల్మనరీ రిససిటేషన్ (సీపీఆర్)లో శిక్షణను, ప్రజల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడమే ఈ కార్యక్రమం లక్ష్యం. ఈ వారోత్సవాలను కేంద్ర ఆరోగ్య కార్యదర్శి శ్రీమతి పుణ్య సలిల శ్రీవాస్తవ ప్రారంభించారు. ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారులు, ఆరోగ్య నిపుణులు, వైద్య సంస్థలకు చెందిన ప్రతినిధులు, పౌరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆరోగ్య కార్యదర్శి శ్రీమతి పుణ్య సలిల శ్రీవాస్తవ మాట్లాడుతూ.. సీపీఆర్ చేసే సామర్థ్యాలను ప్రజల్లో పెంపొందించాల్సిన తక్షణ అవసరాన్ని తెలియజేశారు. “ఆరోగ్య నిపుణుల సాయం లభించే వరకు హ్యాండ్స్-ఓన్లీ సీపీఆర్ చేయడం ద్వారా ముఖ్యమైన అవయవాలకు రక్త సరఫరా కొనసాగేలా, ఆక్సిజన్ అందేలా చేయవచ్చు. ఇది ప్రాణాలు నిలిచే అవకాశాలను ఎన్నో రెట్లు పెంచుతుంది” అని అన్నారు.

ప్రతి ఇల్లు, పాఠశాల, కార్యాలయం, బహిరంగ ప్రదేశాల్లో కనీసం ఒక్కరైనా.. ప్రాణాలను రక్షించే ఈ విధానంలో శిక్షణ పొందాలనే ఉద్దేశంతో సీపీఆర్ అవగాహనా వారోత్సవాలను మంత్రిత్వ శాఖ ప్రారంభించిందని ఆమె తెలియజేశారు. ‘భారత్‌లో ఆకస్మిక మరణాల వెనుక ఉన్న ప్రధాన కారణాల్లో కార్డియాక్ అరెస్ట్ ఒకటి కావడంతో ఈ కార్యక్రమం రూపుదిద్దుకుంది. ఆసుపత్రి వెలుపల సంభవిస్తున్న మరణాల్లో దాదాపు 70 శాతం.. తక్షణ వైద్య సాయం అందుబాటులో లేని చోట జరుగుతున్నాయి. పక్కనే ఉన్న వ్యక్తి సకాలంలో సీపీఆర్ చేయగలిగితే.. ప్రాణాలు నిలిచే అవకాశాలు గణనీయంగా పెరుగుతాయి’ అని ఆమె తెలియజేశారు.

సీపీఆర్‌పై అవగాహన పెంచుతామని, ప్రాణాలు రక్షించే ఈ విధానాన్ని నేర్చుకొనేలా ఇతరులను ప్రోత్సహిస్తామని ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు ప్రతిజ్ఞ చేశారు. అలాగే కార్డియాక్ ఎమర్జెన్సీ సమయంలో ప్రాణాలను రక్షించేందుకు సులభమైన, ఎవరైనా చేయగలిగే హ్యాండ్స్-ఓన్లీ సీపీఆర్‌పై వైద్య నిపుణులు ప్రత్యక్ష ప్రదర్శన ఇచ్చారు.

దేశంలో సీపీఆర్ చేసే వారి సంఖ్య తక్కువగా ఉండటాన్ని గుర్తించిన ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ సమాజ కేంద్రీకృత ప్రయత్నాలను పెంపొందించేందుకు 2025 అక్టోబర్ 13-17 వరకు దేశవ్యాప్తంగా సీపీఆర్ అవగాహన వారోత్సవం నిర్వహిస్తోంది. జాతీయ స్థాయి ప్రతిజ్ఞ, సీపీఆర్ చేయడంపై భౌతిక - వర్చువల్ విధానాల్లో ప్రదర్శన, నిపుణులతో ముఖాముఖి, ప్యానెల్ చర్చలు, ఇతర ఐఈసీ కార్యకలాపాలను ఈ వారోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తారు. సీపీఆర్ అవగాహన వారోత్సవ ప్రారంభ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా ఆరోగ్య రంగానికి చెందిన వారితో పాటుగా.. వైద్య సంస్థలకు చెందిన ప్రతినిధులు, పౌర సమాజం నుంచి 15,000 మంది హాజరయ్యారు.

## చోరీకి గురైన మొబైల్స్ అందజేత



హైదరాబాద్, అక్టోబర్ 14: సిటీ పోలీస్ ఈస్ట్‌జోన్ పరిధిలో చోరీకి గురైన రూ. 25లక్షల విలువైన 100 మొబైల్స్‌ను సోమవారం అంబర్‌పేటలోని కార్యాలయంలో ఈస్ట్‌జోన్ డీసీసీ బాలస్వామి ఆధ్వర్యంలో యజమానులకు అందజేశారు.

జోన్ పోలీసులు చేపట్టిన స్పెషల్‌డ్రైవ్‌లో సీఈఐఆర్, సాంకేతిక సహకారంతో రికవరీ చేసిన మొబైల్స్‌ను ఐఎంఈఐ నెంబర్ నిర్ధారించుకుని అందజేసినట్లు డీసీపీ బాలస్వామి పేర్కొన్నారు.

## శ్రీశైలం దేవస్థానం మాస్టర్‌ప్లాన్‌పై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సమీక్ష



శ్రీశైలం, అక్టోబర్ 14: శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున దేవస్థానం అభివృద్ధికి సంబంధించిన మాస్టర్ ప్లాన్‌పై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సమీక్ష నిర్వహించారు. ఉప ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో జరిగిన సమీక్షా సమావేశంలో దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పాల్గొన్నారు. శ్రీశైలం దేవస్థానం అభివృద్ధి, మాస్టర్ ప్లాన్ అమలు, దశల వారీగా అభివృద్ధి ప్రణాళికలపై సమగ్ర సమీక్షించనున్నారు. శ్రీశైలం ఆలయం పరిసర ప్రాంతాల అభివృద్ధి, భక్తులకు సౌకర్యాలు, క్షేత్ర అభివృద్ధి కోసం అటవీ శాఖ అభ్యంతరాలు తదితర అంశాలు, విస్తరణపై చర్చించనున్నారు. సమీక్షా సమావేశంలో పాల్గొన్న దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ హరి జవహర్ లాల్, కమిషనర్ రామచంద్ర మోహన్, అటవీ శాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు.

శ్రీశైలం అభివృద్ధి మాస్టర్ ప్లాన్‌లో రహదారులు, వసతి గృహాలు, పార్కింగ్, భక్తుల సౌకర్యాలు, పర్యాటక మౌలిక సదుపాయాలపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఆలయ పరిసరాల్లో పర్యావరణ పరిరక్షణ, అటవీ శాఖ అనుమతులపై సమగ్ర సమీక్షించనున్నారు. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సూచనలతో భవిష్యత్తులో శ్రీశైల క్షేత్ర మాస్టర్ ప్లాన్‌పై దృష్టి సారించారు. శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామివారల దర్శనానికి ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 16న ప్రధాని నరేంద్ర మోదీ రానున్నారు. ఈ సందర్భంగా ప్రధానికి మాస్టర్ ప్లాన్‌కు సంబంధించిన సమగ్ర సమాచార నివేదికను సమర్పించాలని అధికారులు యోచిస్తున్నారు.

## 22 నుంచి యాదగిరిగుట్టలో కార్తీక మాసోత్సవాలు

### -6 బ్యాచ్‌లుగా సత్యనారాయణ వ్రతాలు
### -కార్తీక పౌర్ణమి రోజున 8 బ్యాచ్‌లుగా వ్రతాలు
### -ఈఓ రవి ఏర్పాట్ల పరిశీలన

యాదగిరిగుట్ట, అక్టోబర్ 14 : యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానంలో ఈ నెల 22వ తేదీ నుంచి నవంబర్ 20వ తేదీ వరకు కార్తీక మాసోత్సవాలు అత్యంత



వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ ఈఓ జి.రవి తెలిపారు. మంగళవారం యాదగిరిగుట్ట దేవస్థానంతో పాటు కొండ కింద వ్రత మండపాన్ని ఆయన పరిశీలించారు. కార్తీకమాసంలో అధిక సంఖ్యలో భక్తులు రానున్న నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని విధాలుగా ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకు రావాలని ఇంజినీరింగ్, శానిటేషన్, వ్రత మండపం, రిసెప్షన్, గోదాం, పరిపాలన, భద్రతా సిబ్బంది, పాతగుట్ట, ప్రసాద విక్రయం, ప్రచార శాఖ, లీజెస్, ఆన్‌లైన్ విభాగాలకు ఆయన పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సత్యనారాయణ స్వామి వ్రత మండపంలోని హాల్ 1, 2 లలో రోటేషన్ పద్ధతిన 6 బ్యాచ్ లుగా సత్యనారాయణస్వామి వ్రతాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మొదటి బ్యాచ్ ఉదయం 7 గంటలకు ప్రారంభమై చివరి 6వ బ్యాచ్ సాయంత్రం 6 గంటలకు ముగుస్తుందన్నారు. నవంబర్ 5వ తేదీన కార్తీక పౌర్ణమి సందర్భంగా 8 బ్యాచ్ లుగా వ్రతాలు జరుగనున్నట్లు చెప్పారు. ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు వ్రతాలు కొనసాగుతాయన్నారు. పాతగుట్ట ఆలయంలో నాలుగు బ్యాచ్‌లు, కార్తీకపౌర్ణమి రోజున 6 బ్యాచ్‌లు వ్రతాలు నిర్వహిస్తామన్నారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా నవంబర్ 5వ తేదీన ప్రధానాలయంతో పాటు అనుబంధ పర్వత వర్ధనీ సమేత రామలింగేశ్వర స్వామివారి ఆలయంలో ఆకాశ దీపారాధన కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కార్తీకమాసాంతం వరకు ప్రతి శని, ఆదివారాలలో వెయ్యి మందికి ఉచిత అన్నప్రసాదం ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## గురుకులాలకు నిధులపై సీఎం మాటలు నీటి మూటలేనా..? : హరీశ్‌రావు

హైదరాబాద్, అక్టోబర్ 14:గురుకులాకు గ్రీన్ ఛానెల్‌లో నిధులు విడుదల చేస్తామన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాటలు నీటి మూట లేనా.. అని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ప్రశ్నించారు. కమీషన్‌లు రావనే ఆయన గురుకులాలకు నిధులు కేటాయించడం లేదా.. అని విమర్శించారు. హామీలతో మభ్యపెట్టడం, ఆ తర్వాత మాట మార్చడమే రేవంత్ అనుసరిస్తున్న సిద్ధాంతమా.. అని నిలదీశారు. ఈ మేరకు హరీశ్‌రావు ఎక్స్ ఖాతాలో ఒక పోస్టు పెట్టారు.



ఇంకా ఆయన ఏమన్నారంటే.. ‘రేవంత్ రెడ్డి మాటలకు, చేతలకు పొంతన ఉండదనడానికి గురుకులాలకు కేటాయించిన చాలీచాలని నిధులే ఉదాహరణ. రాష్ట్రంలోని 1024 గురుకులాలకు కేవలం రూ.60 కోట్లు కేటాయించి, గోరంతను కొండంతగా చెప్పుకోవడం సిగ్గుచేటు. రూ.12 వేల కోట్లతో యంగ్ ఇండియా సమీకృత గురుకులాలు ఏర్పాటు చేస్తామని ప్రచారం చేసుకుంటున్న రేవంత్ రెడ్డికి ఆరున్నర లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ బిడ్డలు చదివే గురుకులాలకు కనీసం రూ.100 కోట్లు కేటాయించే మనసు లేదా..’ అని ప్రశ్నించారు.

‘కమీషన్లు రావనే గురుకులాలకు నిధులు కేటాయించడం లేదా మీరు కేటాయించిన చాలీచాలని నిధులతో సిబ్బంది వేతనాలు, మోటార్ల మరమ్మతులు, అత్యవసర పనులు ఎలా సాధ్యం చిత్తశుద్ధిలేని సమీక్షలతో గురుకులాలకు ఏం ప్రయోజనం ఒకవైపు సమస్యల వలయంలో గురుకులాలు కొట్టుమిట్టాడుతుంటే తూతూమంత్రంగా సమీక్ష నిర్వహించడం దుర్మార్గం. గురుకులాలకు నిత్యావసరాలు సరఫరా చేసే కాంట్రాక్టర్లకు ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న బిల్లులు ఎప్పుడు చెల్లిస్తారు పెండింగ్ లో ఉన్న మెస్ చార్జీలు, కాస్మొటిక్ ఛార్జీలు, స్టిచ్చింగ్ ఛార్జీలు ఎప్పుడిస్తారు అద్దె భవనాల్లో కొనసాగుతున్న గురుకులాలకు అద్దె బకాయిలు ఎప్పుడు చెల్లిస్తారు.. నెలలుగా పెండింగ్‌లో ఉన్న తాత్కాలిక సిబ్బంది వేతనాలు ఎప్పుడిస్తారు’ అని హరీశ్‌రావు నిలదీశారు.

‘మీరు కేటాయించిన చాలీచాలని నిధులతో సమస్యలకు పరిష్కారం ఎలా చూపుతారు గణితం ఉపాధ్యాయులను నియమించాలని నిన్న మెదక్ జిల్లా చేగుంట గురుకులం విద్యార్థులు రోడ్డెక్కారు పురుగులన్నం మాకొద్దు అంటూ నిత్యం ఏదో ఒక చోట విద్యార్థులు ఆందోళనలు చేస్తున్నారు గురుకులాల మీద ప్రభుత్వానికి పట్టింపు ఉంటే విద్యార్థులు ఎందుకు నిరసనలు తెలియజేస్తున్నారు బడిబాట పట్టాల్సిన విద్యార్థులను, ఆందోళన బాట పట్టించింది కాంగ్రెస్ ప్రభుత్వం. రేవంత్ రెడ్డీ మీ 22 నెలల పాలనలో గురుకులాల ఖ్యాతిని దిగజార్చారు. విష వలయాలుగా మార్చారు. అపఖ్యాతిని మూటగట్టుకున్నారు’ అని మండిపడ్డారు.

‘గ్రీన్ చానెల్లో గురుకులాలు, వసతి గృహాల బిల్లులు చెల్లిస్తామన్న మాటలు ఇంకెప్పుడు కార్యరూపం దాల్చుతాయి.. ఫోటోలకు ఫోజులు ఇవ్వడం, ఏదో చేస్తున్నట్లు ప్రచారం చేసుకోవడంవల్ల గురుకులాల్లో సమస్యలు తీరవు. గురుకులాల కాంట్రాక్టర్ల పెండింగ్ బిల్లులు, గురుకులాల అద్దె బకాయిలు, నెలలుగా పెండింగ్‌లో ఉన్న తాత్కాలిక సిబ్బంది వేతనాలు, మెస్, కాస్మొటిక్, స్టిచ్చింగ్ ఛార్జీలు వెంటనే చెల్లించాలి. 22 నెలలుగా గురుకులాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికై అవసరమైన నిధులు విడుదల చేయాలి’ అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

# రాజస్థాన్ ప్రభుత్వం చేపట్టిన రూ. 4 లక్షల కోట్ల విలువైన అభివృద్ధి పనులను ప్రారంభించిన కేంద్ర హోం, సహకార మంత్రి శ్రీ అమిత్ షా

న్యూఢిల్లీ, అక్టోబర్ 14:కేంద్ర హోం, సహకార మంత్రి శ్రీ అమిత్ షా ఈ రోజు రాజస్థాన్‌లోని జైపూర్‌లో కొత్త క్రిమినల్ చట్టాలపై రాష్ట్ర స్థాయి ప్రదర్శనను ప్రారంభించారు. రూ. 4 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులతో చేపట్టే పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేసి ప్రారంభించారు. రాజస్థాన్ ప్రభుత్వం చేపట్టిన పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించి, శంకుస్థాపనలు చేశారు. రాజస్థాన్ ముఖ్యమంత్రి శ్రీ భజన్ లాల్ శర్మ, కేంద్ర హోం శాఖ కార్యదర్శి శ్రీ గోవింద్ మోహన్, అనేక మంది ప్రముఖులు ఈ కార్యక్రమాలకు హాజరయ్యారు.

ఈ కార్యక్రమంలో కేంద్ర హోంమంత్రి శ్రీ అమిత్ షా మాట్లాడుతూ ఈనాటి కార్యక్రమం అభివృద్ధిని, న్యాయాన్నీ సమన్వయం చేసే సందర్భమని అన్నారు. దేశ క్రిమినల్ జస్టిస్ వ్యవస్థలో ప్రాథమిక మార్పులను తీసుకువచ్చే మూడు కొత్త క్రిమినల్ చట్టాలను ప్రవేశపెట్టడానికి, రాజ్యాంగం అందించిన హక్కులను ప్రజలకు సరళమైన రీతిలో అందుబాటులోకి తీసుకురావడానికి ఈ రోజు ఇక్కడ అత్యాధునిక ప్రదర్శనను ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. రాజస్థాన్ అభివృద్ధిని మరింత వేగవంతం చేస్తూ.. రైజింగ్ రాజస్థాన్ కార్యక్రమంలో సంతకాలు చేసిన అవగాహన ఒప్పందాలకు సంబంధించిన రూ. 35 లక్షల కోట్ల విలువైన పనులకు గానూ రూ. 3 లక్షల కోట్ల పనులు ఇప్పటికే పూర్తయ్యాయనీ, అదనంగా రూ. 4 లక్షల కోట్ల పనులు ఈ రోజు భూమి పూజతో ప్రారంభించినట్లు కేంద్ర హోంమంత్రి వివరించారు.

క్రిమినల్ జస్టిస్ వ్యవస్థతో సంబంధం ఉన్న ప్రతి ఒక్కరూ ఈ ప్రదర్శనను తప్పక సందర్శించాలని, రాబోయే రోజుల్లో మన క్రిమినల్ జస్టిస్ వ్యవస్థలో రానున్న ముఖ్యమైన మార్పులను ఇది ప్రదర్శిస్తుందని శ్రీ అమిత్ షా తెలిపారు. 160 ఏళ్ల నాటి చట్టాల స్థానంలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన మూడు కొత్త చట్టాల సహాయంతో.. 2027 తర్వాత దాఖలయ్యే ఎఫ్ఐఆర్‌కు మూడేళ్లలోపు న్యాయం ఎలా అందుతుందో ఈ ప్రదర్శన ద్వారా ప్రజలు తెలుసుకుంటారని ఆయన అన్నారు. కొత్త క్రిమినల్ చట్టాలు దేశ ప్రజలకు సకాలంలో, అందుబాటులో, సరళీకృత న్యాయాన్ని అందిస్తాయని శ్రీ అమిత్ షా ఉద్ఘాటించారు. జీవన సౌలభ్యం కోసం ప్రధానమంత్రి శ్రీ మోదీ దేశంలో అనేక మార్పులను ప్రవేశపెట్టారని, ఈ కొత్త చట్టాల అమలు ద్వారా న్యాయ సౌలభ్యంలోనూ గణనీయమైన పరివర్తన ఉంటుందని ఆయన తెలిపారు.

మూడు కొత్త చట్టాల ద్వారా మన క్రిమినల్ జస్టిస్ వ్యవస్థ శిక్ష కంటే న్యాయంపైనే ప్రధానంగా దృష్టి సారిస్తుందని కేంద్ర హోంమంత్రి తెలిపారు. ఈ చట్టాలను దేశవ్యాప్తంగా కచ్చితంగా అమలు చేశామనీ.. హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎమ్‌హెచ్ఏ) అన్ని రాష్ట్రాలకూ వాటి అమలు, అనుసరణలో మార్గదర్శనం చేస్తోందని ఆయన అన్నారు. బ్రిటీషు పాలనలో రూపొందించిన చట్టాలు.. అక్కడి పార్లమెంటులో ఆమోదించిన చట్టాలు.. బ్రిటీషు పాలనను రక్షించడానికి రూపొందించిన చట్టాల స్థానంలో మన భారతీయులు రూపొందించిన చట్టాలను ప్రవేశపెట్టామన్నారు. భారత పార్లమెంటు ఈ చట్టాలను ఆమోదించడం.. భారతీయులకు న్యాయం అందించాలనే లక్ష్యం.. ఒక చరిత్రాత్మక విజయమని ఆయన స్పష్టం చేశారు.

కొత్త క్రిమినల్ చట్టాల్లో మహిళలు, పిల్లలపై జరిగే నేరాల కోసం ప్రత్యేక అధ్యాయాన్ని చేర్చామని శ్రీ అమిత్ షా తెలిపారు. ఈ-ఎఫ్ఐఆర్, జీరో ఎఫ్ఐఆర్ కోసం నిబంధనలు రూపొందించడం.. అన్ని రకాల జప్తుల విషయంలో వీడియో చిత్రీకరణను తప్పనిసరి చేయడం.. ఏడు సంవత్సరాల కంటే ఎక్కువ శిక్ష విధించే నేరాలకు ఫోరెన్సిక్ దర్యాప్తు తప్పనిసరి చేయడం ఇందులోని ముఖ్యాంశాలుగా కేంద్ర హోంమంత్రి పేర్కొన్నారు.

రాజస్థాన్‌లో నేర నిర్ధారణ రేటు 42 శాతంగా ఉండేదని, ఈ చట్టాలను అమలు చేసిన ఒక సంవత్సరంలోనే ఇది 60 శాతానికి పెరిగిందని ఆయన అన్నారు. ఈ చట్టాలు పూర్తిగా అమలయిన తర్వాత ఈ రేటు 60 శాతం నుంచి 90 శాతానికి పెరుగుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ చట్టాలను సజావుగా అమలు చేయడం కోసం 2020లో నేషనల్ ఫోరెన్సిక్ సైన్స్ విశ్వవిద్యాలయం (ఎన్ఎఫ్ఎస్‌యూ) ఏర్పాటుతో పాటు.. శాస్త్రీయ దర్యాప్తులో శిక్షణ పొందిన యువతతో కూడిన కొత్త సిబ్బంది కోసం దేశవ్యాప్తంగా అనుబంధ కళాశాలలనూ ప్రారంభిస్తున్నామని శ్రీ అమిత్ షా అన్నారు.

మొదటిసారిగా భారత న్యాయ వ్యవస్థలోని కొత్త క్రిమినల్ చట్టాల్లో ఉగ్రవాదం, అరాచక వ్యక్తుల సమూహం, వ్యవస్థీకృత నేరాలు, డిజిటల్ నేరాల నిర్వచనాలనూ పొందుపరిచామన్నారు. ఈ చట్టాలు 29కి పైగా నిబంధనల్లో కాల పరిమితులను నిర్దేశిస్తాయని ఆయన అన్నారు. దేశం విడిచి పారిపోయిన నేరస్థులకు శిక్ష పడేలా వారి గైర్హాజరు సందర్భంలో విచారణకు ఒక నిబంధనను ప్రవేశపెట్టామని కేంద్ర హోంమంత్రి తెలిపారు. దేశంలో ఈ మూడు కొత్త క్రిమినల్ చట్టాల ప్రారంభాన్ని 21వ శతాబ్దంలోనే అతిపెద్ద సంస్కరణగా శ్రీ అమిత్ షా అభివర్ణించారు.

ఈ చట్టాలను పూర్తిగా అమలు చేసిన తర్వాత భారత క్రిమినల్ జస్టిస్ వ్యవస్థ ప్రపంచంలోనే అత్యాధునిక వ్యవస్థగా మారుతుందన్నారు. ఈ చట్టాల అమలుతో దాదాపు 50 శాతం చార్జిషీట్లు ఇప్పుడు సకాలంలో దాఖలవుతున్నాయనీ.. ఈ రేటు వచ్చే ఏడాది 90 శాతానికి చేరుకుంటుందని భావిస్తున్నట్లు కేంద్ర హోం మంత్రి తెలిపారు.

లక్షలాది మంది పోలీసు అధికారులు, వేలాది మంది న్యాయాధికారులు, ఎఫ్ఎస్ఎల్ (ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ) అధికారులు, జైలు సిబ్బందికీ శిక్షణ పూర్తయిందని ఆయన అన్నారు. ఈరోజు రూ. 4 లక్షల కోట్ల విలువైన పెట్టుబడి ప్రతిపాదనలకు భూమి పూజ కార్యక్రమం జరిగిందని శ్రీ అమిత్ షా తెలిపారు. రాజస్థాన్‌లో భజన్ లాల్ శర్మ ప్రభుత్వం సంతకం చేసిన రూ. 35 లక్షల కోట్ల విలువైన ఎమ్ఓయూలలో ఇప్పటికే రూ. 7 లక్షల కోట్ల విలువైన పనులను విజయవంతంగా పూర్తి చేసిందన్నారు. ఈ విజయం ద్వారా పలు అభివృద్ధి ప్రాజెక్టులు రాజస్థాన్ యువతకు అనేక ఉపాధి అవకాశాలను అందిస్తాయని ఆయన తెలిపారు. నేడు రూ. 9,315 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులు కూడా ప్రారంభమయ్యాని ఆయన పేర్కొన్నారు. మునుపటి ప్రభుత్వం విద్యార్థుల యూనిఫామ్‌లలో అవినీతికి పాల్పడిందనీ.. అయితే ప్రస్తుత భజన్ లాల్ ప్రభుత్వం 47,000 మంది విద్యార్థులకు డీబీటీ ద్వారా నేరుగా రూ. 260 కోట్లు పంపిణీ చేసిందని శ్రీ అమిత్ షా తెలిపారు. పాల ఉత్పత్తిని పెంచడానికి రాజస్థాన్‌లోని 5 లక్షలకు పైగా పాల ఉత్పత్తిదారులకు రూ. 364 కోట్ల సబ్సిడీ ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. 150 ఉచిత విద్యుత్ యూనిట్ల పథకానికి రిజిస్ట్రేషన్ కూడా ఈ రోజు ప్రారంభమైందని తెలిపారు. వీటితో పాటు 56 ఎఫ్ఎస్ఎల్ (ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ) వాహనాలు, అనేక పోలీసు వాహనాలనూ ప్రారంభించినట్లు శ్రీ అమిత్ షా వివరించారు.

నేషనల్ అగ్రికల్చరల్ కోఆపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎన్ఏఎఫ్ఈడీ), నేషనల్ కోఆపరేటివ్ కన్స్యూమర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎన్‌సీసీఎఫ్) లలో నమోదు చేసుకున్న రైతులు పండించే కంది, మసూర్, మినుముల వంటి పప్పు ధాన్యాలను 100 శాతం కనీస మద్దతు ధరకి కొనుగోలు చేయాలని మోదీ ప్రభుత్వం నిర్ణయించిందని కేంద్ర హోంమంత్రి తెలిపారు. రాజస్థాన్‌లో ఇప్పటికే మినుములు పండిస్తున్నారని, అక్కడ కంది పంటనూ పండించవచ్చన్నారు. రాష్ట్ర రైతులు ఎన్ఏఎఫ్ఈడీ, ఎన్‌సీసీఎఫ్‌లలో నమోదు చేసుకోవాలనీ, ఆ తర్వాత వారు పండించిన పప్పు దినుసులను భారత ప్రభుత్వం కనీస మద్దతు ధర చెల్లించి సేకరిస్తుందని ఆయన తెలిపారు. పప్పు ధాన్యాలు, నూనె గింజల రంగంలో దేశం స్వయం-సమృద్ధి సాధించడం కోసం రైతులు తమ ఉత్పత్తిని పెంచాల్సిన అవసరం ఉందని శ్రీ అమిత్ షా అన్నారు.

## ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం..

తిరుపతి, అక్టోబర్ 14: గుడిమల్లం ఆలయానికి నూతనంగా ఏర్పాటు చేసిన బైపాస్ మార్గానికి సిమెంటు రోడ్డు మంజూరు చేయాలని గుడిమల్లం ఆలయ ఈవో కె. రామచంద్రారెడ్డి, మాజీ చైర్మన్ బత్తల గిరి నాయుడులు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ ను అభ్యర్థించారు.

జిల్లా కలెక్టర్ ను శ్రీ పరశు రామస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ బత్తలగిరి నాయుడు, కార్యనిర్వాహణాధికారి రామచంద్ర రెడ్డి ఘనంగా సన్మానించారు. ఆలయానికి నూతనంగా నిర్మించిన బైపాస్ రోడ్డునకు సిమెంట్ రోడ్డు కొరకు కలెక్టర్ కు అర్జీ సమర్పించారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించి జనవరి నెలలో రోడ్డుపని చేయిస్తానని హామీ ఇచ్చారు.

ఈ సందర్భంగా నూతన అన్నదానం షెడ్డు ( తాత్కాలిక షెడ్డు) కొరకు తగిన ప్రతిపాదనను కలెక్టర్ ద్వారా స్టేట్ ఆర్కియాలజీ శాఖ కమిషనర్ కి పంపుతామని కలెక్టర్ హామీ ఇచ్చారు.

## ఎంత ఖర్చయినా సరే.. మేడారం ప్రాంగణాన్ని అద్భుతంగా తీర్చిదిద్దుతాం

### -మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్ అక్టోబర్ 14 (ఎక్సం ప్రెస్ న్యూస్ );: ఎంత ఖర్చయినా సరే.. మేడారం ప్రాంగణాన్ని అద్భుతంగా తీర్చిదిద్దుతామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మేడారం పనులు సకాలంలో పూర్తి చేయడమే తన విధి అని అన్నారు. మేడారం అభివృద్ధి పనులను మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి పరిశీలించారు. మేడారం గద్దెల ప్రాంగణ పునర్నిర్మాణ పనులపై అధికారులతో సమీక్ష జరిపారు. నిర్దేశించిన గడువులోపు పనులు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా మేడారంలో పొంగులేటి మీడియాతో మాట్లాడుతూ.. అభివృద్ధి పనులపై అందరి సూచనలు తీసుకుంటూనే ఉంటామని, కేవలం ప్రాంగణం అభివృద్ధి కోసమే రూ. 101 కోట్లు కేటాయించామని తెలియజేశారు. అన్ని హంగులతో 90 రోజుల్లో పనులు పూర్తి చేయాలని, మేడారం అభివృద్ధికి రూ. 212 కోట్ల నిధులతో మాస్టర్ ప్లాన్ వేశామని అన్నారు. నిధులు ఎక్కువైనా ఇచ్చేందుకు సిద్ధమని, మేడారంలో భక్తులకు అన్ని రకాల సదుపాయాలు ఉండాలని సిఎం రేవంత్ రెడ్డి ఆదేశించారని పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.

# నేతాజీ సుభాష్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్‌లో సత్తా చాటిన వరంగల్ జిమ్నాస్టిక్ క్రీడాకారులు



హనుమకొండ, అక్టోబర్ 14: కోల్‌కతా నేతాజీ సుభాష్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్‌లో 2024-25 విద్యాసంవత్సరానికి గాను జిమ్నాస్టిక్స్ డిప్లొమా ఇన్ కోచింగ్‌లో వరంగల్ జిమ్నాస్ట్‌లైన సూర్యదేవ్, శివసాయి, ప్రశాంత్ అత్యుతమైన ర్యాంకులతో డిప్లొమా సాధించారు. అందులో పేర్న సూర్యదేవ్ 72.12 శాతంతో మొదటి స్థానం సంపాదించి టాప్‌లో నిలిచారు. జంగా శివసాయి 68.7 శాతంతో 4వ ర్యాంక్ సాధించగా, టి.ప్రశాంత్ 60.83 శాతంతో సెకండ్ డివిజన్‌లో ఉత్తీర్ణత సాధించారు.

వరంగల్ జిమ్నాస్టిక్ అకాడమిలో 2009 నుంచి 2021 వరకు శిక్షణ పొందిన వీరు ఉమ్మడి వరంగల్ జిల్లా ద్వారా మన రాష్ట్రనికి ప్రాతినిధ్యం వహించి వివిధ జాతీయ జిమ్నాస్టిక్ పోటీల్లో పాల్గొని పలు పతకాలను సాధించడమే కాకుండా కాకతీయ యూనివర్సిటీ ద్వారా అఖిల భారత యూనివర్సిటీ పోటీల్లో కూడా పతకాలు సాధించారు. ఉన్నతస్థాయి ప్రమాణాలు కలిగిన క్రీడాకారులకు మాత్రమే ప్రవేశం కలిపించి క్రీడా శిక్షకులను తయారుచేసే శిక్షణ సంస్థ అయిన నేతాజీ సుభాష్ సు షనల్ ఇన్స్?టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్? కోల్‌కతాలో 2024-25 విద్యాసంవత్సరానికి వారు ప్రవేశం సంపాదించారు.

ఈ జాతీయ క్రీడా సంస్థలో నిర్వహించే కఠినమైన ప్రవేశ పరీక్షల్లోను సూర్యదేవ్ మొదటి స్థానం, శివసాయి మూడవ స్థానం సంపాదించారు. 20 సీట్లకే పరిమితమైన ఈ జాతీయ క్రీడాసంస్థలో ఒకే ప్రాంతం నుండి ఒకే సంవత్సరంలో ముగ్గురు అడ్మిషన్ సాధించి ఉత్తమ ఫలితాలు సాధించడం ఘనత కాగా, అదే స్ఫూర్తితో శిక్షణ కొనసాగించి డిప్లొమాలోను అదే రాంకు సాధించడం మరో ఘనతగా చెప్పవచ్చని వరంగల్ జిమ్నాస్టిక్స్?అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.రమేశ్‌రావు, ప్రధాన కార్యదర్శి ఏ.సాంబయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యకుడు మధుసూదన్, శ్రీనివాసరావు, సోమరాజు, కమలాకర్, కార్యదర్శి సాంబయ్య, ట్రెజరర్ భరద్వాజ, ఇతర కార్యవర్గ సభ్యులు, ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు మహమ్మద్ అజీజ్‌ఖాన్, ఇతర సంఘాల సభ్యులు వారికి అభినందనలు తెలిపారు.

# మద్యం షాపులకు దరఖాస్తుల వెల్లువ

### -ఈ నెల 18తో దరఖాస్తుల స్వీకరణకు గడువు పూర్తి

### -ఇప్పటి వరకు తెలంగాణ అంతటా 5663 దరఖాస్తులు

హైదరాబాద్ అక్టోబర్ 14 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); మద్యం షాపులకు రెండేళ్లకోసారి ఎక్సైజ్ శాఖ దరఖాస్తులను ఆహ్వానిస్తుంది. దీనితో తెలంగాణ ప్రభుత్వానికి ప్రధాన ఆదాయవనరుగా ఉన్న మద్యం షాపులకు తెలంగాణ అంతటా దరఖాస్తుల జోష్ కొనసాగుతుంది. తెలంగాణ లోని 2620మద్యం షాపులకు నూతన అబ్కారీ విధానం ప్రకారం టెండర్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఇప్పటి వరకు తెలంగాణ అంతటా 5663 దరఖాస్తులు వచ్చాయి ఈ నెల 18తో దరఖాస్తుల స్వీకరణకు గడువు పూర్తవుతుంది.గత రెండేళ్ల క్రితం మద్యం షాపులకు 1.32 లక్షల దరఖాస్తులు వచ్చాయి. చివరి రెండు రోజుల్లో 45వేల నుంచి 50వేల దరఖాస్తులు వచ్చాయి. 13నుంచి 18వరకు సాగే దరఖాస్తుల కు 14మినహా మిగతా తేదీల్లో ఆశజనక దరఖాస్తులు వస్తాయని అబ్కారీ అధికారులు పేర్కొంటున్నారు. చివరి మూడు రోజుల్లో దరఖాస్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉందన్న అంచనాతో అధికారులు అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఎక్సైజ్ డివిజన్ల వారీగా, రంగారెడ్డి, హైదరాబాద్ డివిజన్లలోను, ఉమ్మడి జిల్లాల వారీగా అదనపు కౌంటర్ లు ఏర్పాటుకు ఎక్సైజ్ శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.అంతేగాక దరఖాస్తు దారులకు ఎలాంటి అసౌకర్యాలు కలగ కుండా ఎక్సైజ్ కమిషనర్ సి. హరికిరణ్ పర్యవేక్షణ చేస్తున్నారు. గతంలో లాగా ఈ సారి కూడా ఏపీ, కర్ణాటక, మహారాష్ట్ర తో పాటు ఇతర రాష్ట్రాల నుంచి దరఖాస్తులకు వ్యాపారులు ఆసక్తి చూపుతున్నారని ఎక్సైజ్ అధికారులు పేర్కొన్నారు. ప్రభుత్వం కేటాయించిన రిజర్వేషన్లకు గౌడ ఎస్సీ ఎస్టీ వ్యాపారాలు కూడా దరఖాస్తులు చేసుకుంటున్నారు గౌడ కులస్తులకు 671, ఎస్సీలకు 202, ఎస్టీ రిజర్వేషన్లు 84, జనరల్ లో4686 దరఖాస్తులు వచ్చినట్టు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. అదిలాబాదులో 142, హైదరాబాదులో 746, కరీంనగర్లో 392, ఖమ్మంలో260, మహబూబ్నగర్లో 278, నల్గొండలో 568, నిజాంబాద్ లో 255, మెదక్లో411, రంగారెడ్డిలో 2353, వరంగల్ లో258 దరఖాస్తులు వచ్చాయి.

# స్థానిక ఉద్యోగుల నియామకాలపైనే దృష్టి

### -టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) కీలక ప్రకటన

న్యూ ఢిల్లీ అక్టోబర్ 14 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );దేశంలోనే అతిపెద్ద ఐటీ సేవల సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) కీలక ప్రకటన చేసింది. హెచ్-1బీ వీసా ఉద్యోగులపై ఆధారపడటాన్ని తగ్గించుకుంటున్నట్లు స్పష్టం చేసింది. స్థానిక ఉద్యోగుల నియామకాలపైనే (US workforce)దృష్టి పెట్టనున్నట్లు వెల్లడించింది. ఈ మేరకు టీసీఎస్ (TCS) సీఈఓ కె.కృతివాసన్ ఓ మీడియా ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ విషయాన్ని వెల్లడించారు. అమెరికాలోని టీసీఎస్ సంస్థలో ప్రస్తుతం సరిపడా హెచ్-1బీ ఉద్యోగులు ఉన్నట్లు చెప్పారు. 32,000 నుంచి 33,000 మంది ఉద్యోగులు ఉన్నారన్నారు. అందులో దాదాపు 11 వేల మంది హెచ్-1బీ వీసాపైన వచ్చినవారేనని తెలిపారు. ఇక ఈ ఏడాది ఇప్పటికే భారత్ నుంచి దాదాపు 500 మందిని ఈ వీసాలపై అమెరికాకు పంపినట్లు వివరించారు. ఈ ఏడాది హెచ్-1బీ వీసా కింద కొత్త నియామకాలు చేపట్టే ప్రణాళిక లేదని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం ఎల్-1 వీసాల సదుపాయం కూడా ఉందని.. అవి హెచ్-1బీని భర్తీ చేయలేవని వెల్లడించారు.అమెరికా లో ఉద్యోగం చేయాలనుకునే వారికి డొనాల్డ్ ట్రంప్ భారీ షాక్ ఇచ్చిన విషయం తెలిసిందే. విదేశీ నిపుణుల నియామకానికి జారీ చేసే హెచ్-1బీ వీసా దరఖాస్తులపై వార్షిక రుసుంను లక్ష డాలర్లకు పెంచారు. ఈ మేరకు కార్యనిర్వాహక ఉత్తర్వులపై సంతకం చేశారు. ట్రంప్ చర్య భారతీయులపై తీవ్ర ప్రభావం పడనుంది.భారత్‌కు చెందిన పలు దిగ్గజ సంస్థలు ఎక్కువగా హెచ్-1బీ వీసాలతోనే అమెరికాలో తమ వ్యాపార కార్యకలాపాలు సాగిస్తున్నాయి. ఈ వీసాలతోనే భారతీయుల్ని నియమించుకుంటున్నాయి. ఇందులో అమెజాన్ సంస్థ టాప్‌లో ఉంది. ఆ తర్వాత టాటా కన్సల్టెన్సీ రెండోస్థానంలో నిలిచింది.యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ డేటా ప్రకారం.. 2024-25 ఆర్థిక సంవత్సరం జూన్ నాటికి అమెజాన్ దాదాపు 10,044 హెచ్-1బీ వీసాలను ఉపయోగించింది. ఆ తర్వాత టీసీఎస్ 5,505, మైక్రోసాఫ్ట్ (5,189), మెటా (5,123), యాపిల్ (4,202), గూగుల్ (4,181), డెలాయిట్ (2,353), ఇన్ఫోసిస్ (2,004), విప్రో (1,523), టెక్ మహీంద్రా అమెరికాస్ (951), ఒరాకిల్ (2,092), అమెజాన్ వెబ్ సర్వీసెస్ (2,347), కాగ్నిజెంట్ టెక్నాలజీ సొల్యూషన్స్ (2,493), వాల్‌మార్ట్ అసోసియేట్స్ (2,390) హెచ్-1బీ వీసాలను దక్కించుకున్నాయి. ఇవే కాకుండా అమెరికాకు చెందిన పలు కంపెనీలు కూడా హెచ్-1బీ వీసాలతో ఎక్కువమంది భారతీయులను నియమించుకుంటున్నాయి. వాటిపై కూడా తీవ్ర ప్రభావం పడనుంది.

## బోరబండ బీఆర్ఎస్ ఇన్చార్జిలుగా ఉమ్మడి నల్లగొండ జిల్లా నేతలు

హైదరాబాద్, అక్టోబర్ 14 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో తిరిగి జయకేతనం ఎగుర వేయాలని బీఆర్ఎస్ గట్టి పట్టుదలతో ఉంది. డివిజన్ల లో పార్టీ శ్రేణులను ఎన్నికలకు సమాయత్తం చేసేందుకు ఇన్చార్జిలా నియామకానికి బీఆర్ఎస్ శ్రీకారం చుట్టింది. సోమవారం బోరబండ డివిజన్లో ఉమ్మడి నల్గొండ జిల్లా నాయకులను పార్టీ ఇన్చార్జిగా నియమించారు. ఈ ఎన్నికల సన్నాహక సమావేశానికి క్లస్టర్ ఇన్చార్జిలు... బూత్ స్థాయి మెంబర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి ,మాజీ శాసనసభ్యులు బూడిద బిక్షమయ్య గౌడ్ , గ్యాదరి కిషోర్ కుమార్ , పైళ్ల శేఖర్ రెడ్డి , ప్రభాకర్ రెడ్డి , బొల్లా మల్లయ్య యాదవ్ , భగత్ యాదవ్ , కోటి రెడ్డి , చింతల వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొని నాయకులకు దిశా నిర్దేశం చేశారు.

# గండిమైసమ్మ ఎంఆర్ఓ కార్యాలయం ముందు ఓ యువ రైతు ఆత్మహత్యాయత్నం



కుత్బుల్లాపూర్ అక్టోబర్ 14 (ఎక్సం ప్రెస్ న్యూస్ );: మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా కుత్బుల్లాపూర్ మండలం దుండిగల్ గండిమైసమ్మ ఎంఆర్ఓ కార్యాలయం ముందు ఓ యువ రైతు ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. గగిల్లాపూర్ తండాకు చెందిన సిద్దూ(27) అనే యువకుడు తన భూమిని ఓ బడానిర్మాణ సంస్థకు కట్టబెట్టేందుకు రెవెన్యూ అధికారుల యత్నిస్తున్నారని ఆరోపణలు చేశాడు. తన భూమికి హద్దులు ఏర్పాటు చేయాలని ఎంఆర్ఒ ఆఫీస్ చుట్టూ తిరిగాడు. రెవెన్యూ అధికారులు 6లక్షలు రూపాయలు డిమాండ్ చేయడంతో యువకుడి మనస్తాపం చెందాడు. తన భూమి పత్రాలు పట్టుకుని ఎంఆర్ఒ కార్యాలయం ముందు ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యయత్నానికి ప్రయత్నించాడు.

# ఇద్దరు కవల పిల్లలను చంపి, ఓ తల్లి ఆత్మహత్య



బాలానగర్ అక్టోబర్ 14 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); హైదరాబాద్‌లోని బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం జరిగింది. ఇద్దరు కవల పిల్లలను చంపి, ఓ తల్లి ఆత్మహత్య చేసుకుంది.వివరాల్లోకి వెళ్తే.. ఏపీలోని ఏలూరు జిల్లా నూజివీడుకు చెందిన సాయిలక్ష్మి (27)కి అనిల్ కుమార్‌తో నాలుగేళ్ల క్రితం వివాహమైంది. పెళ్లి తర్వాత పద్మారావు నగర్ ఫేజ్ 1లో నివాసం ఉంటున్నారు. ఈ దంపతులకు రెండేళ్ల వయసు ఉన్న కవల పిల్లలు చేతన్ కార్తికేయ, లాస్యత వల్లి ఉన్నారు. అయితే వీరు తరచూ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. చేతన్‌కు మాటలు రాకపోవడంతో కొంతకాలంగా స్పీచ్‌థెరపీ ఇప్పిస్తున్నారు. పిల్లల విషయంలో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి.ఈ క్రమంలోనే తాజాగా మరోసారి గొడవ జరగడంతో మనస్తాపం చెందిన సాయిలక్ష్మి బలవన్మరణానికి పాల్పడింది. తాను ఆత్మహత్య చేసుకోవడానికి ముందు ఇద్దరు పిల్లలను గొంతు నులిమి చంపేసింది. అనంతరం మూడో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. కాగా, సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. భార్యాభర్తల మధ్య గొడవల నేపథ్యంలో అనిల్‌కుమార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

## 13 నెలల పసికందుపై కామాంధుడు అత్యాచారం ఆపై చంపేసి పొలంలో పాతిపెట్టి

అగర్తాలా అక్టోబర్ 14 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: పసికందుపై కామాంధుడు అత్యాచారం చేసి అనంతరం చంపేసి పొలంలో పాతి పెట్టాడు. ఈ సంఘటన త్రిపుర రాష్ట్రం పాణిసాగర్ జిల్లాలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అస్సాం రాష్టం నిలంబజార్‌కు చెందిన జలాల్ ఉద్దిన్ అనే వ్యక్తి పాణిసాగర్‌లో కూలీగా పని చేస్తున్నాడు. ఓ మహిళ నుంచి 14 నెలల పాపను తీసుకొని బయట ఆడిస్తానని నమ్మించాడు. అనంతరం గ్రామ శివారులోకి తీసుకెళ్లి పాపపై అత్యాచారం చేసి చంపేశాడు. అనంతరం పాపను పొలంలో పాతిపెట్టిపారిపోయాడు. మూడు గంటల నుంచి పాపను జలీల్ తీసుకరాకపోవడంతో తల్లి చిన్నారి కోసం వెతకడం ప్రారంభించింది. గ్రామస్థులు అందరూ పాప కోసం వెతికారు. ఎక్కడా కనిపించకపోవడంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. గ్రామ శివారులో పొలంలో పాతిపెట్టిన పాప మృతదేహం కనిపించింది. వెంటనే పోలీసులు మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు. పోలీసులు పోక్సో యాక్టు కింద కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

## ఇంట్లోనే ఉరివేసుకొని మృతి

దండేపల్లి, అక్టోబర్ 14: దండేపల్లి మండలంలోని గుడిరేవు గ్రామానికి చెందిన పుసాల రాజు (36)అనే వ్యక్తి జీవితం పై విరక్తి చెంది ఇంట్లో ఎవరు లేని సమయంలో ఇనుప రాడ్డుకు ఉరి వేసుకుని మృతి చెందాడు. దండేపల్లి ఎస్సై తహసినోద్దీన్, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడు రాజు ఆర్థిక పరిస్థితులు బాగలేకపోవడంతో గత కొద్ది రోజుల నుంచి మద్యానికి బానిసై ఇంట్లో తన భార్యతో తరుచు గొడవ పడడంతో అతని భార్య మూడు రోజుల క్రితం పిల్లలను తీసుకొని పుట్టింటికి వెళ్లిపోయింది. దాంతో రాజు జీవితం పై విరక్తి చెంది ఈ రోజు ఉదయం ఇంట్లో ఇనుప రాడ్డుకు ఉరి వేసుకుని మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుని తల్లి పుసాల లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తహసినోద్దీన్ తెలిపారు.

# అమ్మవారికి నవ ధాన్యాలతో నైవేద్యం

దండేపల్లి, అక్టోబర్ 13: దండేపల్లి మండలం గుడిరేవు గోదావరి నది తీరాన గల పద్మల్ పురి కాకో ఆలయంలో దండారి ఉత్సవాలలో భాగంగా భక్తులు ఈ రోజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుండి కాకుండా మహారాష్ట్ర, చత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుండి భక్తులు ప్రత్యేక వాహనాలలో తరలి వచ్చి అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

తెలంగాణ రాష్ట్ర గిరిజన అర్థిక అభివృద్ధి సంస్థ చైర్మన్ కోట్నాక తిరుపతి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా ఆలయం కమిటీ సభ్యుడు, చైర్మన్‌ను గిరిజనులు సంప్రదాయ వాయిద్యాలతో ఆలయంలోకి స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా గుస్సాడినృత్యాలు ఆకట్టుకున్నాయి. అమ్మవారికి గిరిజన మహిళలు నవ ధాన్యాలతో తయారు చేసిన నైవేద్యం సమర్పించి తమ కుటుంబాలను చల్లగా చూడమ్మ అంటూ మొక్కుకుని మొక్కులు తీర్చుకున్నారు.

